
ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888
Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 01 సంచిక -325 పేజీలు - 08 వెల - 06/- శుక్రవారం 28 ఫిబ్రవరి 2025






# సూపర్‌సిక్స్‌కు ప్రాధాన్యం.

## నేడే బడ్జెట్

### ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా భారీగా కేటాయింపులు

- 2.4 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ సాధించేలా ఆలోచనలు
- మూల ధన వ్యయాన్ని మరింత పెంచేలా ప్లాన్
- దీర్ఘకాలిక ప్రణాళికలతో బడ్జెట్ కూర్పు
- తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఫ్రీ బస్సు కీలకం
- ఆర్థికంగా లోటున్నా సంక్షేమానికి పెద్దపీట
- రాజధాని ప్రాంతం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం
- డిజిటల్ గవర్నెన్స్, ఐటీ హబ్‌లపైనా ప్రత్యేక దృష్టి
- గ్రామీణ ఆరోగ్య రంగంపైనా మరింత శ్రద్ధ
- రాష్ట్ర ఆర్థికాన్ని స్థిరపరిచేలా పూర్తిస్థాయి బడ్జెట్
- పలు అంశాలపై కీలక సూచనలు చేసిన సీఎం




2లో

ఏపీ బడ్జెట్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. ఈ బడ్జెట్‌కు ముఖ్య లక్ష్యం రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటు 15 శాతం సాధించడం.. 2.4 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందడమే. ఇందుకోసం మూలధన వ్యయాన్ని పెంచుతూ, దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం యత్నిస్తోంది. తమ పథకాల అమలుకు తగినంత నిధులు కేటాయించడమే కాకుండా, వాటి ఆర్థిక ప్రభావాన్ని సమీక్షించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాల అమలుకు పెద్దపీట వేస్తోంది.

## అసౌకర్యం కలిగితే క్షమించండి



**ఐక్యత కోసం జరిగిన మహా యజ్ఞం**

**కుంభమేళాతో ప్రపంచమే ఆశ్చర్య పోయింది**

**కుంభమేళా ముగింపుపై మోడీ వెల్లడి**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్):-
ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక 'మహాకుంభమేళా' ఘనంగా ముగిసింది. 45 రోజుల పాటు సాగిన ఈ కుంభమేళా విశేషాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన బ్లాగ్‌లో రాశారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం అంత సులువు కాదన్నారు. ఏర్పాట్ల విషయంలో భక్తులెవరైనా అసౌకర్యానికి గురైతే గనుక అందుకు క్షమించాలని కోరారు. 'ఐక్యత కోసం జరిగిన మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసింది. భారతీయ ఐక్యతకు కుంభమేళా నిదర్శనంగా నిలిచింది. అంచనాలను మించి వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. భారత్ కొత్త శక్తితో ముందుకుసాగుతోందని, నవ భారత్‌ను నిర్మించే కొత్త శకం వచ్చిందని చెప్పేందుకు ఇదే నిదర్శనం అని అన్నారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని దేనితోనూ పోల్చలేం. త్రివేణి సంగమం నదీ తీరానికి అన్ని కోట్ల మంది ఎలా వచ్చారా? అని యావత్ ప్రపంచం ఆశ్చర్యపోతోంది.

మిగతాది 2లో...

## తెలుగు రాష్ట్రాల్లో ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్

**3న ఓట్ల లెక్కింపు.. ఫలితాల ప్రకటన**



అమరావతి,ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్):-
తెలుగు రాష్ట్రాల్లో ఆరు ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం జరిగిన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఆంధ్రప్రదేశ్ లో 3, తెలంగాణలో 3 ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ జరిగింది. అయితే, సాయంత్రం 4 గంటల వరకు క్యూ లైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. మిగతాది 2లో...

## 9 గంటల పాటు పోసాని ని ప్రశ్నించిన పోలీసులు

**ఓబులవారిపల్లె పీఎస్‌లో పోసానిని విచారించిన పోలీసులు**

**ఎస్పీ విద్యాసాగర్ ఆధ్వర్యంలో విచారణ**

**రైల్వేకోడూరు కోర్టుకు తరలించి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచిన పోలీసులు**



2లో

## స్కిల్‌బీ ద్వారా నర్సింగ్ స్టూడెంట్స్ కు జర్మన్ భాషలో శిక్షణ

**మంత్రి నారా లోకేశ్ సమక్షంలో స్కిల్‌బీ అవగాహన ఒప్పందం**

**ఏటా వెయ్యి మంది నర్సింగ్ విద్యార్థులకు జర్మనీలో ఉద్యోగాలు**

**బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం విద్యనభ్యసించే విద్యార్థినులకు ఐరోపా దేశాల్లో ఉద్యోగావకాశాలు**




రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం విద్యనభ్యసించే విద్యార్థినులకు జర్మనీ, ఐరోపా దేశాల్లో ఉద్యోగావకాశాలు లభించేలా శిక్షణ ఇప్పించేందుకు ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, స్కిల్‌బీ నడుమ అవగాహన ఒప్పందం కుదిరింది. మిగతా 2లో...

## పోసానికి పార్టీ అండగా ఉంటుంది

**పోసాని భార్యను పరామర్శించిన జగన్**

**పోసాని భార్య కుసుమలతకు ఫోన్ చేసిన జగన్**

**పొన్నవోలుతో పాటు పలువురు వైసీపీ నేతలను కోర్టు వద్దకు పంపించామని వెల్లడి**




2లో

## శ్రీశైలం, నాగార్జున సాగర్ నీటిని జాగ్రత్తగా వాడుకోవాలి

**: ఏపీ, తెలంగాణలకు కేఆర్ఎంబీ**

**తాగునీటికి మొదటి ప్రాధాన్యతను ఇస్తూ పంటలను దృష్టిలో పెట్టుకోవాలని సూచన**




2లో

## నివాసయోగ్య పత్రం చూశాకే బ్యాంకులు నిర్మాణాలపై రుణాలు ఇవ్వాలి

**అక్రమ నిర్మాణాలు, బ్యాంకు రుణాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ**

**ఇటీవల సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలతో తాజా మార్గదర్శకాలు జారీ**

**అధికారులు ఎప్పటికప్పుడు బిల్డింగ్ ప్లాన్, నిర్మాణాన్ని తనిఖీ చేయాలని ఆదేశాలు**

ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్):-
అనధికార, అక్రమ నిర్మాణాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని రాష్ట్రాలకు ఇటీవల సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలతో తాజా మార్గదర్శకాలు జారీ అయ్యాయి.పురపాలక శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం,మిగతాది 2లో...

## ఎమ్మార్ ప్రాపర్టీస్ వ్యవహారంపై ప్రభుత్వం చొరవ

**వివాదాల పరిష్కారానికి అంగీకారం**

**ఎమ్మార్ ప్రతినిధులతో సిఎం రేవంత్ సమీక్ష**



2లో

రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/87888
శుక్రవారం 28 ఫిబ్రవరి 2025

# సూపర్ సిక్స్ కు ప్రాధాన్యం

అమరావతి,ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్):-
సూపర్ సిక్స్ పథకాల్లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం 2.0, సామాజిక భద్రతా పెన్షన్లు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ కీలకమైనవి. వీటిలో కొన్నింటిని ఇప్పటికే అమలు చేస్తున్నారు. మరికొన్నింటిని త్వరలోనే అమలు చేస్తామని కూటమి పెద్దలు ప్రకటించారు. ఈ హామీల అమలుకు భారీగా నిధులు కేటాయించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నా, సంక్షేమ పథకాలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.
రాజధాని అభివృద్ధిని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చంద్రబాబు ప్రభుత్వం మూడేళ్లలో 60,000 కోట్ల వ్యయంతో అమరావతిని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వరల్డ్ బ్యాంక్, ఆసియా డెవలప్మెంట్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి 30,000 కోట్ల పైగా రుణాలకు హామీ తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ సందర్భంగా దీనిపై మరింత క్లారిటీ ఇవ్వనుంది. పట్టణ పునరుద్ధరణ ప్రాజెక్టులు, మెరుగైన రహదారి కనెక్టివిటీ, పరిశ్రమల వృద్ధి, పునరుత్పత్తి శక్తి రంగాల్లో పెట్టుబడులు బడ్జెట్‌లో ముఖ్య ప్రాధాన్యం పొందనున్నాయి.
ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, ఐటీ హబ్‌ల అభివృద్ధి, తయారీ పరిశ్రమల వృద్ధి తదితర రంగాల్లో ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ పథకాలతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, ఆరోగ్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. పాఠశాలల మౌలిక సదుపాయాల మెరుగుదల, ఉచిత ఆరోగ్య సంరక్షణ పథకాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల బలోపేతం ఈ బడ్జెట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.
ఆర్థిక శాఖకు 28 శాఖల బడ్జెట్ సమీక్షలు పూర్తి కావడంతో, మంత్రులంతా తమ శాఖలకు అధిక నిధులు కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఇరిగేషన్ మంత్రిత్వ శాఖ మాత్రమే 37,000 కోట్లు కోరగా, ప్రభుత్వం 27,000 కోట్లు కేటాయించేందుకు సిద్ధంగా ఉంది. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే ఈ పూర్తి స్థాయి బడ్జెట్, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని స్థిరపరిచేలా, సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, పరిశ్రమల పెట్టుబడులకు సమతుల్యత కల్పించేలా ఉండబోతోందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# కూటమి ప్రభుత్వానికి కాలం దగ్గర పడింది

## నేరస్థులను వదిలి..విపక్ష నేతల అరెస్ట్ - విజయవాడ పోలీసుల నోటీసులపై గోరంట్ల మాధవ్

అనంతపురంఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్):-నేరం చేసిన వారిని వదిలిపెట్టి.. ప్రతిపక్షాలను అరెస్ట్ చేసే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చూడుతోందని హిందూపురం మాజీ ఎంపీ, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ ఆరోపించారు. అందుకు ఈ ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో అతి త్వరలో మీ చేష్టలు, అక్రమ కేసులకు అంతర్యుద్ధం రావడానికి ఎంతో దూరం లేదన్నారు. హిందూపురం మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ నివాసానికి విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు వెళ్లారు. ఆయనకు సెక్షన్ 35 బీఎన్ఎస్ఎస్ కింద పోలీసులు నోటీసులు అందజేశారు. మార్చి 5వ తేదీన సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాలని గోరంట్ల మాధవ్‌కు ఆ నోటీసుల్లో స్పష్టం చేశారు. 2024, నవంబర్ 2 తేదీన సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో మహిళా కమిషన్ మాజీ



చైర్మన్ వాసిరెడ్డి పద్మ ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ ఇంటర్వ్యూలో ఫోక్సో కేసులో బాధితురాలి పేరు గోరంట్ల మాధవ్ చెప్పారంటూ ఆయనపై కేసు నమోదు చేశారు. విజయవాడ పోలీసులు జారీ చేసిన నోటీసులపై మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ స్పందించారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగానే తాను ఈ వ్యాఖ్యలు చేశానని స్పష్టం చేశారు. దీనిని కూటమి ప్రభుత్వంలోని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మైండ్‌లో పెట్టుకోవాలని సూచించారు. రాజ్యాంగం ప్రసాదించిన భావప్రకటన స్వేచ్ఛను హరిస్తున్నారంటూ కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. విజయవాడ పోలీసులు ఇచ్చిన నోటీసులు తీసుకున్నానన్నారు. మార్చి ఐదో తేదీన హాజరు కావాలని చెప్పారని.. న్యాయవాదుల సలహా తీసుకొని పోలీసుల విచారణకు వెళ్తాన్నారు. అయితే ప్రింట్ మీడియాలో సోషల్ మీడియలో వచ్చిన పేర్లను మాత్రమే తాను ప్రస్తావించాన్నారు. దీనిపై కేసు నమోదు చేసి అసలు ముద్దాయిలను వదిలిపట్టారని గోరంట్ల మాధవ్ మండిపడ్డారు.

# ప్రశ్నార్ధకంగా ప్రముఖమైన భాషల మనుగడ

## తెలుగు భాషని కాపాడుకోవలసిన బాధ్యత అందరిది - అంతర్జాతీయ తెలుగుభాషా సమావేశాల్లో వక్తల వెల్లడి

తిరుపతి,ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్):-
ప్రపంచంలోనే ప్రముఖమైన భాషల మనుగడ ప్రశ్నార్ధకంగా మారిందని, అందులో తెలుగు భాష ప్రాముఖ్యత కూడా రోజురోజుకి తగ్గిపోతుందని, తెలుగు భాషని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని, తెలుగు భాషాభివృద్ధికి సమష్టి కృషి చేయవలసిన అవసరం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ, ప్రాచ్య పరిశోధనా సంస్థ, తెలుగు సంపద, బెంగళూరు సంయుక్తంగా నిర్వహించిన మూడవ అంతర్జాతీయ తెలుగు భాషా సమావేశాలు తిరుపతిలో ఎస్వీయూలోని సేనెట్ హాల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం వేదికగా ఇటువంటి గొప్ప సదస్సు నిర్వహించుకోవడం మంచి పరిణామమని, భారతీయ భాషల్లో తెలుగు విశిష్టతను కలిగిందని అన్నారు. తెలుగుదనం తగ్గి , ఆంగ్లత్వ పోకడులు సినిమా, మీడియాలో పెరిగాయని వాటిపై అర్థవంతమైన చర్చ జరగాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయంలో తెలుగు భాషా సాహిత్య రంగాలపై విస్తృత పరిశోధనలు సాగాయని తెలిపారు. పూర్వ శాసన మండలి సభ్యులు వితపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విదేశీ భాషల పట్ల వ్యామోహం



పెరుగుతూ ఉందన్నారు. తెలుగు భాష అంతరిస్తూ ఉందనే విషయం సత్య దూరమైనదని చెప్పారు. ప్రపంచ సాహిత్య ప్రమాణాలకు ఏ మాత్రం తీసిపోని తెలుగు రచనలు ఉన్నాయని అన్నారు. ఉన్నవ లక్ష్మీనారాయణ మాలపల్లి నవల, గురజాడ అప్పారావు కన్యాశుల్కం నాటకం ఇందుకు నిదర్శనమని వివరించారు. తెలుగులో కథకు ఇప్పటికీ ఆదరణ ఎక్కువగా ఉందన్నారు. వారానికి సుమారు వంద కొత్త కథలు పత్రికల్లో ప్రచురితమవుతున్నాయని తెలిపారు. కీలకోపన్యాసం చేసిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు గారపాటి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బోధన, అధికారిక కార్యకలాపాల్లో తెలుగు ప్రాధాన్యం పెరగాలన్నారు. భాషా సంబంధ పరిశోధనలు విశ్వవిద్యాలయాల్లో మరింతగా సాగాలని కోరుకున్నారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన శాశ్వత పరిష్కారం కాదని , డిగ్రీలో ఒక సంవత్సరం మాత్రమే తెలుగు చదువుకునే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు భాషా పరిశోధకులు స.వెం. రమేశ్ మాట్లాడుతూ తెలుగు సమాజానికి వెలుపల తెలుగు భాష వివిధ కళా రూపాలు, ఆచారాలూ సంప్రదాయాల రూపంలో కనిపిస్తుందన్నారు. తమిళనాడు, శ్రీలంక వంటి మిగతా రాష్ట్రాల్లోన్రూ, మిగతా దేశాల్లోనూ తెలుగు వెలుగు కనబడుతూ ఉందన్నారు. అసలైన తెలుగు భాషా సంపద ఇదేనని తెలిపారు. తెలుగు భాషను కాపాడుతున్నదంతా సామాన్య నిజమేనని చెప్పారు. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు శలాక రఘునాథ శర్మ మాట్లాడుతూ ధారణ శక్తి వల్ల చురుగ్గా ఆలోచిస్తారని, తెలుగు పద్యాలు అలాంటి ధారణకు సహకరిస్తాయని తెలిపారు. సదస్సులో భాగంగా అన్నమయ్య భవన్ తిరుపతి ఆర్ట్ సొసైటీ వారు 30 మంది చిత్రకారులతో రూపొందించిన 100 వందకు పైగా చిత్రాలను ప్రదర్శించారు. అందరినీ ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని సదస్సు సంచాలకులు ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ, నిర్వహణ కార్యదర్శి ఆచార్య పీసీ వేంకటేశ్వర్లు, సలహాదారు డాక్టర్ రేమిళ్ళ మూర్తి నిర్వహించారు. వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు,పలువురు తెలుగు రచయితలు, భాషాభిమానులు పాల్గొన్నారు.

# స్కిల్‌బీ ద్వారా నర్సింగ్ స్టూడెంట్స్ కు జర్మన్ భాషలో శిక్షణ

(మొదటి పేజి తరువాయి)

రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఇరుపక్షాలు ఎంఓయుపై సంతకాలు చేశాయి. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... జర్మనీలో వృద్ధుల సంరక్షణ, ఆసుపత్రుల్లో 3 లక్షల మంది నర్సింగ్ అభ్యర్థుల కొరత ఉందని తెలిపారు. యూరప్ లో ముఖ్యంగా జర్మనీలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు గాను రాష్ట్రంలో నర్సింగ్ విద్యనభ్యసించిన విద్యార్థినులకు స్కిల్‌బీ ద్వారా జర్మన్ భాషలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ వల్ల ప్రతి ఏటా వెయ్యి మంది నర్సింగ్ విద్యార్థినులకు జర్మనీలో అత్యుత్తమ ప్యాకేజీతో ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. స్కిల్‌బీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కో ఫౌండర్ వింజమూరి రవిచంద్ర గౌతమ్, సీఈఓ ఉజ్వల్ చౌహాన్ మాట్లాడుతూ... తమ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 10వేల మందికిపైగా విదేశాల్లో ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. స్కిల్‌బీ అంతర్జాతీయస్థాయి అత్యుత్తమ రిక్రూట్‌మెంట్ స్టార్టప్‌లలో ఒకటిగా ఉందని తెలిపారు. జర్మనీ, పోలాండ్, హంగేరీ, లిథువేనియా, లాట్వియా, ఇతర తూర్పు ఐరోపా దేశాలకు తమ సంస్థ ద్వారా అభ్యర్థులను రిక్రూట్ చేస్తున్నామని అన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ భాగస్వామ్యంతో బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం స్పెషలైజేషన్ తో గ్రాడ్యుయేషన్ పొందిన నర్సులకు జర్మన్ భాషలో ఉచిత శిక్షణ ఇచ్చి, ప్లేస్ మెంట్ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. స్కిల్‌బీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఏపీఎస్ఎస్‌డీసీలు భాషా నైపుణ్య కొరతను పరిష్కరించి, ఏపీని నైపుణ్య రాజధానిగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, విశాఖపట్నంలోని ప్రైవేటు నర్సింగ్ కళాశాలలు, ఉమ్మడి తూర్పుగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లోని 4వేల మందికి పైగా నర్సింగ్ విద్యార్థులకు స్కిల్‌బీ ద్వారా జర్మన్ భాషలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ అండ్ ట్రైనింగ్ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, ఏపీఎస్ఎస్‌డీసీ సీఈఓ గణేశ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ మనోహర్, మెడిక్రూటర్ ఎండీ రోనాల్డ్ రెస్కే పాల్గొన్నారు.

# నివాసయోగ్య పత్రం చూశాకే బ్యాంకులు నిర్మాణాలపై రుణాలు ఇవ్వాలి

(మొదటి పేజి తరువాయి)

ఆక్యుపేషన్ సర్టిఫికెట్‌పై భవన యజమానుల వద్ద అండర్ టేకింగ్ తీసుకోవాలి. ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఉంటేనే భవనాల్లోకి వచ్చేలా చూడాలి. నిర్మాణం పూర్తయ్యే వరకు ప్లాన్ ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలి. ఎప్పటికప్పుడు అధికారులు బిల్డింగ్ ప్లాన్, నిర్మాణాన్ని తనిఖీ చేయాలి.
డీవియేషన్ సరిచేసే వరకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇవ్వవద్దు. డీవియేషన్ ఉన్న నిర్మాణాలకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇస్తే చర్యలు తీసుకోవాలి. నివాసయోగ్య ధ్రువపత్రం ఇస్తేనే తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి. అక్రమ నిర్మాణాలకు ట్రేడ్, బిజినెస్ లైసెన్స్‌లు జారీ చేయొద్దు. జోనల్ ప్లాన్‌లోనూ డీవియేషన్ లేకుండా నిర్మాణాలు ఉండేలా చూడాలి. నివాసయోగ్య పత్రం చూశాకే బ్యాంకులు నిర్మాణాలపై రుణాలు ఇవ్వాలి.

# పోసానికి పార్టీ అండగా ఉంటుంది

## పోసాని భార్యను పరామర్శించిన జగన్

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో సినీ నటుడు పోసాని కృష్ణమురళిని ఏపీ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ లోని నివాసంలో పోసానిని అరెస్ట్ చేసిన పోలీసులు... అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పోలీస్ స్టేషన్ కు తరలిస్తున్నారు. పోసాని అరెస్ట్ నేపథ్యంలో ఆయన భార్య కుసుమలతకు వైసీపీ అధినేత జగన్ ఫోన్ చేసి పరామర్శించారు. పోసానికి పార్టీ అండగా ఉంటుందని ఆమెకు ధైర్యం చెప్పారు. 'దేవుడు అంతా చూస్తున్నాడు. మీరు ధైర్యంగా ఉండండి. మీకు అందరం తోడు ఉంటాం' అని తెలిపారు. పొన్నవోలు సుధాకర్ రెడ్డి సహా పార్టీ నాయకులందరినీ కోర్టు వద్దకు పంపించామని చెప్పారు. రాష్ట్రంలో నిరంకుశ పాలన ఎక్కువ రోజులు కొనసాగదని చెప్పారు.
జనసేన నేత జోగిమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓబులవారిపల్లె పీఎస్ లో పోసానిపై కేసు నమోదయింది. 196, 353 (2), రెడ్ విత్ 3 (5) సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

# అసౌకర్యం కలిగితే క్షమించండి

(మొదటి పేజి తరువాయి)

ఈ భక్తులెవరికీ అధికారిక ఆహ్వానాలు పంపలేదు. అయినా పవిత్ర సంగమంలో పుణ్యస్నానాల కోసం వారంతా తరలివచ్చారు. నదిలో స్నానమాచరించిన తర్వాత వారి ముఖాల్లో కన్పించిన సంతోషం, సంతృప్తి నేనెప్పటికీ మర్చిపోలేను. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు చాలామంది వ్యయప్రయాసలకోర్చి కుంభమేళాకు రావడం ఆనందంగా ఉందని మోదీ రాసుకొచ్చారు. ఈసందర్భంగా మహాకుంభమేళాను విజయవంతం చేసిన యూపీ ప్రభుత్వం, సహకరించిన ప్రయాగ్‌రాజ్ ప్రజలు, భక్తులకు మోదీ ధన్యవాదాలు తెలిపారు. 'ఇంతటి పెద్ద కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహించడం అనేది అంత సులువు కాదని తెలుసు. మా పూజల్లో ఏదైనా లోపం ఉంటే క్షమించాలని ఆ గంగా, యమునా, సరస్వతి మాతలను ప్రార్థిస్తున్నా. భగవంతుని స్వరూపాలుగా భావించే భక్తులకు సేవ చేయడంలో ఏదైనా లోపం ఉంటే అందుకు ప్రజలు కూడా క్షమించాలని కోరుతున్నా' అని మోదీ రాసుకొచ్చారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు సాగిన మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు పోటెత్తారు. సామాన్య పౌరులతో పాటు పలువురు రాజకీయ, సినీ రంగాలకు చెందిన ప్రముఖులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఫిబ్రవరి 10, ప్రధాని మోదీ ఫిబ్రవరి 5న కుంభమేళాను సందర్శించి పుణ్యస్నానం చేశారు.

# 9 గంటల పాటు పోసాని ని ప్రశ్నించిన పోలీసులు

(మొదటి పేజి తరువాయి)

ప్రముఖ సినీ నటుడు పోసాని కృష్ణమురళి విచారణ ముగిసింది. అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ విద్యాసాగర్ ఆధ్వర్యంలో సుమారు 9 గంటల పాటు పోసానిని విచారించారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు ఆయన దాటవేసే ప్రయత్నం చేసినట్లు సమాచారం.విచారణ అనంతరం పోలీస్ స్టేషన్‌లోనే వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రైల్వే కోడూరు కోర్టుకు తరలించి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. పోసాని కృష్ణమురళిని ఆంధ్రప్రదేశ్ పోలీసులు నిన్న హైదరాబాద్‌లో అరెస్టు చేసి, ఆంధ్రప్రదేశ్‌కు తరలించిన విషయం తెలిసిందే.

# తెలుగు రాష్ట్రాల్లో ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్

(మొదటి పేజి తరువాయి)

ఏపీలో 2 గ్రాడ్యుయేట్, ఒక టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరిగాయి.ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ సమయం ముగిసే నాటికి పశ్చిమ గోదావరి జిల్లాలో 65.43 శాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. దీంతో పాటు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విశాఖపట్నం జిల్లాలో 87.30 శాతం పోలింగ్ నమోదు అయింది. ఎన్‌టీఆర్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగిసే సమయానికి 61.99 శాతం నమోదు అయింది. మరోవైపు, తెలంగాణలోని మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ముగిసింది. ఉమ్మడి కరీంనగర్- మెదక్-నిజామాబాద్- ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 40.61 శాతం, ఇవే జిల్లాల్లో జరుగుతున్న టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 63.49 శాతం పోలింగ్ నమోదు కాగా, వరంగల్- నల్లగొండ- ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 76.35 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తెలిపారు. కాగా, వచ్చే నెల 3వ తేదీన తుది ఫలితాలను ఎన్నికల కమిషన్ వెల్లడించనుంది.

# ఎమ్మార్ ప్రాపర్టీస్ వ్యవహారంపై ప్రభుత్వంచొరవ

హైదరాబాద్,ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్):- ఎమ్మార్ ప్రాపర్టీతో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. వారి న్యాయకమిటీ అందించే సూచనలు,సలహాలు స్వీకరిస్తామని తెలిపింది. వివిధ కేసులతో పెండింగ్‌లో ఉన్న తమ ప్రాజెక్టుల వివాదాలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మార్ ప్రాపర్టీస్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించింది. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మార్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎమ్మార్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ అలబ్బర్, భారత్ లో యూఏఈ మాజీ రాయబారి డాక్టర్ అహ్మద్ అల్ బన్నా, ఎమ్మార్ గ్రూప్ సీఈవో అమిత్ జైన్, ఆ కంపెనీ ఇంటర్నేషనల్ అ÷ర్స్ హెడ్ ముస్తఫా అక్రమ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి,పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి, ఈ సమావేశంలో పాల్గొన్నారు. 2001లో ఉమ్మడి రాష్ట్రంలో దుబాయ్‌కు చెందిన ఎమ్మార్ ప్రాపర్టీస్ హైదరాబాద్లో కన్వెన్షన్ సెంటర్, హోటల్, గోల్ఫ్ కోర్సు, విల్లాలు తదితర ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు అప్పటి ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది. ఏపీఐఐసీతో ఆ సంస్థ చేసుకున్న ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని అప్పట్లో సీబీఐ, ఈడీ కేసులు నమోదయ్యాయి. ఏజెన్సీల దర్యాప్తులు, కోర్టుల్లో విచారణలు కొనసాగుతున్నాయి.తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత 2015 అక్టోబర్‌లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మార్ ప్రాపర్టీస్ కు సంబంధించిన ప్రాజెక్టుల వివాదాల పరిష్కారానికి ఛీఫ్ సెక్రెటరీ సారథ్యంలో అయిదుగురు సెక్రెటరీల కమిటీని ఏర్పాటు చేసింది. మరోవైపు కేంద్ర విదేశాంగశాఖ, సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియాకూడా ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. ఎమ్మార్ ప్రతినిధులతో జరిగిన చర్చల సందర్భంగా ఈ అంశాలన్నింటినీ అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. వివిధ దర్యాప్తు ఏజెన్సీల కేసులు, ఛార్జీ షీట్లు, న్యాయపరమైన అంశాలతో ముడిపడి ఉన్నందున ఎమ్మార్ ఒప్పందాల డాక్యుమెంట్లు, కోర్టు కేసుల వివరాలతో పాటు కేంద్ర ప్రభుత్వ సూచనలన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎమ్మార్ ప్రాపర్టీస్ వ్యవహారాన్ని పరిష్కరించేందుకు 2015లో ఛీఫ్ సెక్రటరీ నేతృత్వంలో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి అదనంగా న్యాయ నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. న్యాయ వివాదాలను అధ్యయనం చేయడానికి, సామరస్య పూర్వక పరిష్కారం చేసుకోవడానికి యూఏఈ ప్రభుత్వ ఆమోదంతో ఒక లీగల్ ఏజెన్సీని ఏర్పాటు చేస్తామని సంస్థ ప్రతినిధులు ప్రతిపాదించగా, వారి ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమోదించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీ వారితో సంప్రదింపులు జరిపి తదుపరి సూచనలు, సలహాలు అందిస్తుందని చెప్పారు.

# ముగిసిన మహాకుంభ మహోత్సవం

## శివరాత్రి స్నానాలతో కుంభమేళాకు ముగింపు -నభూతో..న భవిష్యత్ అన్న చందంగా సాగిన క్రతువు



ప్రయాగరాజ్,ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్):- మహాకుంభమేళా సంబరం ముగిసింది. అనూహ్యంగా ప్రపంచమంతా భారత్ వైపు చూసేలా ఈ ఆధ్యాత్మిక క్రతువు సాగింది. కోట్లాదిమంది హాజరై పుణ్యస్నానాలు చేసిన ఇతివృత్తం గతంలో ఎప్పుడూ జరగలేదని చెప్పవచ్చు. ఓ రకంగా ఇది న భూతో..న భవిష్యత్ అన్న తీరుగా సాగింది. 144 ఏళ్లకోసారి వచ్చే మహాకుంభమేళా మహాఘట్టం బుధవారంముగిసింది. జనవరి 13న మొదలైన ఈ మహా కుంభమేళా.. మహా శివరాత్రి పర్వదినంతో ముగిసింది.. చివరి రోజున భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. మహాకుంభమేళాలో మహాశివరాత్రి రోజున 2.5 కోట్లకు పైగా భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు.. ప్రయాగ్‌రాజ్‌లోని సంగం ఒడ్డున 45 రోజుల పాటు జరిగిన మహాకుంభమేళాలో ఇప్పటివరకు 65 కోట్ల మందికిపైగా పుణ్యస్నానాలు చేసినట్టు యూపీ ప్రభుత్వం వెల్లడించింది.. చివరి రోజున గణాంకాలు చూసుకుంటే.. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.. ఏడు శైవ అఖారాలకు, మహాకుంభ్-2025 బుధవారం నాడు గొప్ప ఊరేగింపుల తర్వాత కాశీ విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలతో మహాశివరాత్రి నాడు ముగిసింది. ఊరేగింపులో భాగంగా, 10,000 మందికి పైగా నాగ సాధువులు, పండుగ ఉత్సాహాన్ని పెంచుతూ, కాశీ రోడ్ల గుండా తమ దేవతలు, జెండాలతో, త్రిశూలాలు, కత్తులు, గదలను ప్రదర్శిస్తూ 'హర్ హర్ మహాదేవ్' నినాదాల మధ్య పాడుతూ, నృత్యం చేస్తూ ప్రదర్శన చేశారు. శివరాత్రి రోజున పుణ్యస్నానాలు ఆచరించేందుకు ప్రయాగ్‌రాజ్‌కు భక్తులు పోటెత్తారు. చివరిరోజున కుంభమేళాలో భక్తులపై హెలికాప్టర్‌తో పూలవర్షం కురిపించారు.. ఆధ్యాత్మిక యాత్రకు వచ్చే వారిలో మరింత భక్తిభావం పెంచేలా ఇలా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. మహా శివరాత్రి పర్వదినం కూడా కలిసిరావడంతో 'హర హర మహాదేవ్' నామస్మరణలతో త్రివేణీసంగమం ఘాట్లు మార్మోగాయి. కుంభమేళాలో చివరి అమృతస్నానం ఆచరించేందుకు భక్తులు అర్ధరాత్రి నుంచే పెద్దసంఖ్యలో ఘాట్ల వద్దకు చేరుకొన్నట్లు అధికారులు తెలిపారు. దేశం నలుమూలలతోపాటు నేపాల్ నుంచి కూడా భక్తుల బృందం ఒకటి తరలివచ్చింది. కుంభమేళా ప్రాంతంలోని అయిదు ప్రధాన శివాలయాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బాలీవుడ్ ప్రముఖనటి ప్రీతి జింటా బుధవారం త్రివేణీసంగమంలో పుణ్యస్నానం చేశారు. కుంభమేళాకు తాను రావడం ఇది మూడోసారి అంటూ ఆమె తన 'ఎక్స్' హ్యాండిల్‌లో ఓ వీడియో పోస్టు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సీనియర్ అధికారులతో కలిసి గోరఖ్‌పుర్ కంట్రోల్ రూములో తెల్లవారుజామున 4 గంటల నుంచే ఏర్పాట్లను పర్యవేక్షించారు. జనవరి 13న మొదలై నాగ సాధువుల ఊరేగింపులు, మూడు అమృత స్నానాలతో వైభవంగా 45 రోజులపాటు కొనసాగిన మహా కుంభమేళా ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం మొత్తం 65 కోట్లమంది భక్తులు కుంభమేళాను సందర్శించి పుణ్యస్నానాలు చేశారు. జనవరి 29 నాటి రెండో అమృతస్నానం సందర్భంగా రద్దీ వల్ల జరిగిన తొక్కిసలాటలో 30 మంది భక్తులు చనిపోయిన విషాద ఘటన రాజకీయ దుమారం రేపింది. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ వాంగ్‌ఛుక్, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా పలువురు కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, పారిశ్రామికవేత్తలు ముకేశ్ అంబానీ, గౌతం అదానీ, సినీతారలు, క్రీడాకారులు త్రివేణీసంగమంలో పుణ్యస్నానాలు చేశారు. ముగింపు వేడుకల్లో భాగంగా భారత వాయుసేన పైలట్లు అద్భుతమైన వైమానిక విన్యాసాలు ప్రదర్శించారు. కుంభమేళాలో భాగంగా మహా శివరాత్రి రోజు చివరి అమృత స్నానం ఆచరించేందుకు కోట్లాది మంది ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. మహాశివరాత్రి కావడంతో భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతుండటంతో మరోసారి యూపీ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎక్కడికక్కడ ఆంక్షలను అమలు చేస్తూ? అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టింది. కుంభమేళా ప్రాంతాన్ని ఇప్పటికే నో వెహికిల్ జోన్‌గా ప్రకటించి.. సిబ్బందిని భారీగా మోహరించారు. కాగా.. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు సీనియర్ అధికారులతో మాట్లాడుతూ.. శివరాత్రి వేడుకలు సజావుగా జరిగేలా చూశారు.

# మరోమారు వక్రబుద్ధి చూపించుకున్న పాకిస్థాన్

## జెనీవా వేదికగా కాశ్మీర్ ప్రజాస్వామ్యంపై గగ్గోలు

## ధీటుగా తిప్పికొట్టిన భారత ప్రతినిధి




న్యూఢిల్లీ,ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్):- అంతర్జాతీయ వేదికలపై తరచూ పాకిస్థాన్ భారత్‌పై తన అక్కసు వెళ్లగక్కుతున్న పాకిస్థాన్‌కు మరోమారు భారత్ ధీటుగా బదులిచ్చింది. నోరు మూసుకునేలా చేసింది. దాని కుత్సిత బుద్ధిని బయటపెట్టింది. తాజాగా జమ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామ్యం అణచివేతకు గురవుతోందని, మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిలో దాయాది దేశం ఆరోపించింది. ఈ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. అంతేకాక.. మాకు ఉపన్యాసాలు ఇచ్చే స్థాయిలో ఆ దేశం లేదని స్పష్టం చేసింది జెనీవాలో జరిగిన ఈ సమావేశంలో జమ్మూకశ్మీర్‌ను ఉద్దేశించి పాక్ న్యాయ, మానవ హక్కుల మంత్రి అజం నజీర్ తరార్ వ్యాఖ్యలు చేశారు. దీనిపై భారత రాయబారి క్షితిజ్ త్యాగి దీటుగా స్పందించారు. 'కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లు ఎప్పుడూ భారత్‌లో అంతర్భాగమే. దశాబ్దాల తరబడి పాకిస్థాన్ ఉగ్రవాదం కారణంగా దెబ్బతిన్న ఆ ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. మానవ హక్కుల ఉల్లంఘన, మైనారిటీలను హింసించడంతో సహా ప్రజాస్వామ్య విలువలను పాటించని దాయాది దేశం భారత్‌కు ఉపన్యాసాలు ఇచ్చే స్థాయిలో లేదు. ఆ దేశ వాక్‌చాతుర్యంలోనే కపటత్వం కన్పిస్తోంది. ఐరాస జాబితాలోని పలు ఉగ్రవాద సంస్థలకు ఆ దేశం ఆశ్రయం కల్పిస్తుంది. ప్రజాస్వామ్య పురోగతి, ప్రజలకు గౌరవం కల్పించడం వంటి వాటిపై భారత్ దృష్టిసారిస్తుంది. ఆ దేశం మాపై ఆరోపణలు చేయడం మానేసి.. తమ దేశంలోని ప్రజలకు సుపరిపాలనను అందించడంపై దృష్టిపెట్టాలి' అని త్యాగి పేర్కొన్నారు. ఇక, ఇటీవల చైనా అధ్యక్షతన జరిగిన భద్రతామండలి సమావేశంలోనూ పాకిస్థాన్ విదేశాంగ మంత్రి మహమ్మద్ ఇషక్ దార్ జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. దీనికి సైతం భారత్ ఘాటుగా స్పందించింది. జైషే మహమ్మద్ వంటి సంస్థలను ప్రోత్సహించే పాక్.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పడం అత్యంత హాస్యాస్పదమని ఆగ్రహం వ్యక్తంచేసింది. ముందుగా దీనిని సరిదిద్దుకోవాలని సూచించింది.

# ఎమ్మెల్యేలను అడ్డుకుంటున్నారు: అతిషి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్):- దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ సమావేశాల వేళ భాజపా సర్కారుపై ప్రతిపక్ష ఆమ్ ఆద్మీ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ ప్రాంగణంలోకి రానివ్వకుండా బారికేడ్లు పెట్టి మరీ అడ్డుకుంటున్నారని ఆరోపించింది. ఈ మేరకు మాజీ సీఎం, శాసనసభలో ప్రతిపక్ష నేత ఆతిశీ ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై మండిపడ్డారు. 'భాజపా నేతలు అధికారంలోకి రాగానే నియంతృత్వంలో అన్ని హద్దులు దాటేశారు. సభలో జై భీమ్ అని నినాదాలు చేసినందుకు మా పార్టీ ఎమ్మెల్యేలను మూడు రోజుల పాటు సస్పెండ్ చేశారు. ఇప్పుడు విధాన సభ ప్రాంగణంలోకి రాకుండా మమ్మల్ని అడ్డుకుంటున్నారు. ఢిల్లీ అసెంబ్లీ చరిత్రలో ఇలాంటి దారుణం ఎన్నడూ చోటుచేసుకోలేదని ఆమె దుయ్యబట్టారు.

------------------

# నేడు ఎపి కేబినేట్ భేటీ

## బడ్జెట్‌కు లాంఛనంగా ఆమోదం

అమరావతి,ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్):-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలో 2025-26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ను చంద్రబాబు సర్కార్ ప్రవేశ పెట్టనుంది. ఎన్నికలు ముగిసిన తర్వాత పూర్తి స్థాయిలో ఈ బడ్జెట్ ప్రవేశ పెట్టనుంది. ఇందులో భాగంగా శుక్రవారం జరిగే కేబినేట్ సమావేశం బడ్జెట్‌కు లాంఛనంగా ఆమోదం తెలుపనుంది. ఈ మేరకు ఉదయం 9 గంటలకు ఏపీ కేబినేట్ సమావేశం జరగనుంది. ఈ మంత్రి మండలి సమావేశంలో దీనికి ఆమోదం తెలువుతుంది. ఆ తర్వాత ఉదయం 10 గంటలకు శాసన సభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రవేశ పెట్టనున్నారు. కౌన్సిల్ లో మంత్రి కొల్లు రవీంద్ర బడ్జెట్ ను ప్రవేశ పెట్టనుండగా.. వ్యవసాయ బ్జడెట్ ను మంత్రి పొంగూరు నారాయణ ప్రవేశ పెట్టనున్నారు.

# శ్రీశైలం, నాగార్జున సాగర్ నీటిని జాగ్రత్తగా వాడుకోవాలి

## : ఏపీ, తెలంగాణలకు కేఆర్ఎంబీ




అమరావతి,ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్):-


శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల్లోని నీటిని ఉభయ తెలుగు రాష్ట్రాలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయించారు. త్రాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యతనిస్తూ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పంటల సాగును దృష్టిలో ఉంచుకుని నీటిని వినియోగించుకోవాలని చైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలోని బోర్డు నిర్ణయించింది. ఈ బోర్డు సమావేశం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగింది.

తెలంగాణ నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్సీ వెంకటేశ్వరరావు, ఇతర ఇంజినీర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల్లో నీటి వినియోగంపై ఈ సమావేశంలో చర్చించారు.

మే నెలాఖరు వరకు తెలంగాణ రాష్ట్రానికి 63 టీఎంసీల నీరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, 55 టీఎంసీల నీరు అవసరమని ఆయా రాష్ట్రాలు కోరాయి. ప్రస్తుతం రెండు జలాశయాల్లో వినియోగ మట్టానికి ఎగువన 60 టీఎంసీలకు పైగా నీరు అందుబాటులో ఉంది. అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని బోర్డు సూచించింది. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి పరిస్థితిని సమీక్షించుకుంటూ ముందుకు సాగాలని తెలిపింది.

# తెలంగాణలో మిస్‌వరల్డ్ పోటీలు

## మే 7 నుంచి 31 వరకు గ్రాండ్ ఫినాలె -వరల్డ్ ఫెస్టివల్‌లో 120కి పైగా పాల్గొననున్న దేశాలు




హైదరాబాద్,,ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్):- మిస్ వరల్డ్ పోటీలు అంటే ప్రపంచంలోనే ఓ అరుదైన, అద్వితీయమైన వేడుక. వివిధ దేశాల నుంచి సుందరీమణులు పాల్గొనే ఈ వేడుకలకు ఈసారి తెలంగాణలోని హైదరాబాద్ వేదిక కానుంది. ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూసే ప్రపంచ అందాల పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వడం అనే మాట వింటుంటేనే హైదరాబాద్ జోష్ పెంచుతుంది. ఒక్కసారి ప్రపంచం దేశాలన్ని హైదాబాద్ వైపు చూపుతిప్పుకునే ఆ రోజు అతి చేరువలోనే ఉంది. ఈ ఏడాది ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్‌లో చెయ్యాలని నిర్వాహకులు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. దీంతో 72వ మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నది. చారిత్రక, వారసత్వ సంపదను ప్రపంచానికి చాటడానికి తెలంగాణకు ఇదొక గొప్ప అవకాశం కానుంది. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటేందుకు అరుదైన ఘట్టం కానుంది. ఈ ఏడాది అందాల పోటీలకు అనువైన ప్రదేశంగా తెలంగాణను ఎంచుకోవడం, అందులోనూ హైదరాబాద్ వంటి మహానగరం ఈ వేడుకులకు సిద్ధమవ్వడం ఈ ప్రభుత్వంలో జరిగే ఓ అద్వితీయం వేడుకగా చెప్పవచ్చు. ఈ ఏడాది మేనెలలో నాలుగు వారాల పాటు జరిగే ఈ పోటీల ప్రారంభ, ముగింపు వేడుకలతోపాటు గ్రాండ్ ఫినాలేను సైతం హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ ఫెస్టివల్‌లో 120కి పైగా దేశాలు పాల్గొంటాయి. బ్యూటీ విత్ ఎ పర్పస్ అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ మిస్ వరల్డ్ అందాల పోటీల్లో పాల్గొనే దేశ విదేశాల ప్రతినిధులకు తెలంగాణ స్వాగతం పలకబోతుంది. మే 7 నుంచి ఈ అందాల పోటీలు ప్రారంభం కానున్నాయి. మే 31న గ్రాండ్ ఫినాలే ఉంటుంది. ప్రస్తుత మిస్ వరల్డ్ తర్వాత అందాల సుందరి కిరీటాన్ని ఎవరు ధరిస్తారో గ్రాండ్ ఫినాలే రోజు తేలనుంది. గతంలో న్యూఢిల్లీ, ముంబైలో ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించారు. 71వ ఎడిషన్ ముంబైలోనే జరిగింది. ప్రపంచంలోనే అత్యుత్తమ మౌలిక సదుపాయాలున్న హైదరాబాద్ ఇప్పటికే పలు అంతర్జాతీయ వేడుకలకు వేదికైంది. ఐటీ, ఫార్మాసూటికల్, రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో దూసుకెళ్తున్న తెలంగాణకు ఈ అవకాశం దక్కడం నిజంగా గర్వించదగ్గ విషయమే. తెలంగాణను పర్యాటకంగా ప్రపంచ పటంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం చేసినట్లు సమాచారం. తెలంగాణ జరూర్ ఆనా నినాదంతో టూరిజం శాఖ దేశ విదేశీ పర్యాటకులను ఇప్పటికే ఆహ్వానాలు పంపుతోంది. గొప్ప చేనేత వారసత్వం, అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు, అరుదైన వంటకాలు, విభిన్నమైన కళా వారతస్వమున్న తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలను స్వాగతిస్తున్నామని.. మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్మెన్, సీఈఓ జూలియా మోర్లీ, తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ తాజాగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేసారు. మిస్ ఇండియా పోటీలు అంటేనే సుందరీమణుల అలరిస్తారు. అందులోనూ మిస్ వరల్డ్ పోటీలు అంటే ఇంక మాటల్లో చెప్పక్కర్లేదు. ఎంత ఆహ్లాదంగా ఉంటుంతో, అంతే స్థాయిలో వివిధ దేశాల యువతుల మధ్య గట్టిపోటీ కూడా సర్వసాధారణం. ఈ పోటీల వేదికగా హైదరాబాద్ బ్రాండ్ వాల్యూని మరింత పెంచడంతోపాటు, ప్రపందేశాల ప్రతినిధులను ఆకట్టుకునేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసింది తెలంగాణ ప్రభుత్వం.

# జైలు సెల్‌లో ఒంటరిగా ఉండలేను

## తోడుగా మరో ఖైదీని పంపించండి

## కోర్టులో జడ్జికి విన్నవించిన వంశీ

## వార్డెన్‌ను ఏర్పాటు చేసామన్నప్రభుత్వం



విజయవాడ,ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్):- వైకాపా నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ 3 రోజుల పోలీసు కస్టడీ ముగియడంతో విజయవాడ కోర్టులో హాజరుపర్చారు. ఈ సందర్భంగా వంశీ కోర్టులో కీలక వ్యాఖ్యలు చేశారు. జైలులోని సెల్‌లో తనను ఒంటరిగా ఉంచారని న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. తనకు ఆస్తమా సమస్య ఉందని, ఆరోగ్య సమస్య వస్తే ఇబ్బందని తెలిపారు. తనతో పాటు సెల్‌లో మరొకరిని ఉంచాలని, భద్రతా పరంగా తనకు ఇబ్బంది లేదని కోర్టును కోరారు. ఇప్పటికే వంశీకి దగ్గరలో అటెండర్ సౌకర్యం కల్పించారు కదా అని న్యాయమూర్తి అడిగారు. సెల్‌లో మరొకరిని ఉంచేందుకు ఇన్‌ఛార్జి జడ్జిగా తాను ఆదేశించలేనని న్యాయమూర్తి తెలిపారు. సెల్‌లో ఏమైనా జరిగితే అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని న్యాయమూర్తి వ్యాఖ్యానించినట్లు సమాచారం. సెల్ మార్పు కోసం శుక్రవారం రెగ్యులర్ కోర్టులో మెమో దాఖలు చేయాలని వంశీ తరఫు న్యాయవాదికి సూచించారు. సెల్ వద్ద వార్డెన్‌ను ఉంచాలని జైలు సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీ చేశారు. వంశీ భద్రత దృష్ట్యా సెల్‌లో ఒంటరిగా ఉంచామని ప్రభుత్వ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ఆరోగ్య పరిశీలనకు వార్డెన్‌ను ఏర్పాటు చేసేందుకు అభ్యంతరం లేదని తెలిపారు. అనంతరం విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. సత్యవర్ధన్‌ను బెదిరించి కేసు తారుమారు చేయాలని చూశారని విజయవాడ సెంట్రల్ ఏసీపీ దామోదర్ తెలిపారు. వంశీ, అతని అనుచరులు సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసినట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. సీసీ కెమెరా ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు సేకరించాం. కోర్టు ఆదేశాలతో వంశీని 3 రోజులు ప్రశ్నించాం. కొన్నింటికి ఔనని.. మరి కొన్ని ప్రశ్నలకు జవాబివ్వలేదు. కనిపించని ఫోన్ గురించి అడిగితే తెలియదన్నారు. ఈనెల 12న హైదరాబాద్ నుంచి వచ్చి జగన్‌ను కలిసినట్టు వంశీ అంగీకరించారు. మాకు ఇంకా పూర్తి సమాచారం రావాల్సి ఉంది. మరోసారి వంశీతో పాటు ఇతర నిందితులను కస్టడీకి కోరుతూ పిటిషన్ వేస్తామని ఏసీపీ తెలిపారు.

## రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న

# కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ డిమాండ్**

**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్.యు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. గురువారం నాడు మంగళగిరి లోని విద్యా భవన్ నందు పాఠశాల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ ఏ.సుబ్బారెడ్డి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్త ఉన్న కార్పొరేట్ విద్యా సంస్థలైన నారాయణ భాష్యం శ్రీ చైతన్య ఆక్సర్డ్ రవీంద్ర కేకేఆర్ వంటి మరియు కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు 2025 -26 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించారని అన్నారు. కార్పొరేట్ సంస్థల వారు బహిరంగంగా కరపత్రాలు, ఫ్లెక్సీలు వేసి అడ్మిషన్ల కొరకు ఎలక్షన్ ప్రచారం రీతిలో కార్పొరేట్ విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ది ఢిల్లీ పబ్లిక్ స్కూల్, దిక్రీడో ఇంటర్నేషనల్ ఒలంపియాడ్




,ఇంటర్నేషనల్ స్కూల్, అని ప్రచారం నిర్వహిస్తూ ఐఐటి ట్రిబుల్ ఐటీ ఫౌండేషన్ లాంటి కోర్సులు ఎల్కేజీ నుండే ప్రారంభిస్తున్నామని తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి ప్రజలను దోచుకుంటున్నారని విమర్శించారు. ఆర్థికమే ధ్యేయంగా పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు రాష్ట్ర వ్యాప్తంగా సరైనటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించి,చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థ యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్ల పేర్లతో పిఆర్ఓ



లను ,ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ఇంకా ప్రారంభం కాకముందే ముందస్తు అక్రమ అడ్మిషన్ ఫీజులతో పాటు,స్పెషల్ ఫీజు,పుస్తకాల ఫీజులని విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న పాఠశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో పాఠశాలలో ఉధృతమైన ఆందోళన నిర్వహిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు రాష్ట్ర నాయకులుబి.సిద్ధు,కె.నాగరాజు,రూపాశంకర్,శ్రీను,వ ంణి, భానుప్రసాద్ పాల్గొన్నారు.

# శునకాల బెడద నియంత్రణకు చర్యలు

- శస్త్ర చికిత్స కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్ రవీంద్ర బాబు
- చికిత్సలకు ఏడబ్ల్యూబిఐ అనుమతులు మంజూరు
- సంతాన నిరోధక శస్త్ర చికిత్సలను ప్రారంభించినట్లు వెల్లడి

**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి27-( రిపబ్లిక్ న్యూస్)**
నగరంలో శునకాల బెడద నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. గురువారం ఆయన గార్గేయపురం డంప్ యార్డులోని శునకాల సంతాన నిరోధక శస్త్ర చికిత్స కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో కుక్కల బెడద నియంత్రణకు సంబంధించి, వాటికి సంతాన నిరోధక శస్త్ర చికిత్సలను తిరిగి పునః ప్రారంభించినట్లు వెల్లడించారు. ఏజెన్సీకి ప్రాజెక్ట్ రికగ్నేషన్ సర్టిఫికెట్ లేనందున గత ఏడాది ఆగస్టు 8న శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయని, తిరిగి ప్రారంభించేందుకు అనుమతుల కోసం ఇటీవల భారత జంతు సంక్షేమ మండలికి దరఖాస్తు చేసుకున్నామన్నారు. మండలి సభ్యురాలు గత నెల 8న శస్త్ర చికిత్స కేంద్రాన్ని పరిశీలించారని, ఇటీవల అనుమంతులు మంజూరు చేశారన్నారు. దీంతో శునకాలకు శస్త్ర చికిత్సలను పునః ప్రారంభించడం జరిగిందని, ఒక్కొక్క శునక శస్త్ర చికిత్సక రూ.1500 రూపాయలను ఏజెన్సీకి నగరపాలక వెచ్చిస్తుందన్నారు. నగరంలో దాదాపు 15 వేల శునకాలు ఉండొచ్చని, గతంలో 10054 శునకాలకు ఆపరేషన్ చేయడం జరిగిందన్నారు.



# వైభవంగా శివపార్వతుల కళ్యాణం.



**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్):**శివరాత్రి ఉత్సవాలు కర్నూలు లో భక్తి శ్రద్ధలతో జరుపుతున్నారు. నగర సమీపంలోని రాజీవ్ గృహకల్ప వద్దనున్న శివాలయ ఆవరణలో శివపార్వతులకు కళ్యాణం నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత పూసల చిన్న శంకరప్ప ఆధ్వర్యంలో గత ఐదు సంవత్సరాలుగా శివరాత్రి సందర్భంగా కళ్యాణం,అన్నదానం నిర్వహిస్తున్నారు. తమ కాలనీలో దేవాలయం నిర్మించడంతో పాటు శివపార్వతులకు కళ్యాణం నిర్వహిస్తున్నందున కాలనీ వాసులు శంకరప్ప కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. శంకరప్ప, సతీష్ కుమార్, మోహన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు మూడు నెలల పొడిగింపు

కర్నూలు, ప్రతినిధి ఫిబ్రవరి 27: (రిపబ్లిక్ న్యూస్)
రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మూడు నెలలు పాటు అనగా మార్చి 1, 2025 నుండి 31.05.2025 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపుకు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా ఉత్తర్వులు జారీచేసినట్లు కర్నూలు సమాచార శాఖ డిఐపీఆర్వో జయమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు జిల్లాలో ప్రస్తుతం ఫిబ్రవరి 28, 2025 నాటికి అక్రిడిటేషన్ కార్డులు వాలిడిటీ కలిగి పనిచేయుచున్న పాత్రికేయులకు మాత్రమే మార్చి 1, 2025 నుండి 31.05.2025 వరకు పొడిగింపు సౌకర్యం కొనసాగుతుందని, సంబంధిత మీడియా యాజమాన్యం వారి సంస్థలో పని చేయుచున్న, తొలగించిన జర్నలిస్టుల వివరాలను జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి, కర్నూలు వారి కార్యాలయంలో అందచేయాలని డిఐపీఆర్వో ఆ ప్రకటనలో తెలియజేశారు.

## ఢిల్లీ ముఖ్యమంత్రి కార్యాలయంలో

# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, భగత్ సింగ్ ఫోటోలను తొలగించడంపై

**పాములపాడులో నిరసన కార్యక్రమం చేపట్టిన ప్రజా సంఘాల నాయకులు**

పాములపాడు ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్):- పాములపాడులోని, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం దగ్గర మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి. అంకన్న ఆధ్వర్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి కార్యాలయంలో బి.ఆర్.అంబేద్కర్, భగత్ సింగ్ ఫోటోలను తొలగించడంపై ప్రజా సంఘాల నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.షేక్షావలి, మండల ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, వైఎస్ఆర్సిపి నాయకులు మండల కో ఆప్షన్ మెంబర్ సయ్యద్.ముర్తుజాఅలి, శెట్టి.శివలింగం, బీసీ సంఘం నాయకుడు జి.సాయి కృష్ణ, తదితర ప్రజా సంఘాల నాయకులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కె. అంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.షేక్షావలి, మండల ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, మండల కో ఆప్షన్ నెంబర్ సయ్యద్.ముర్తుజాఅలీ, వైసిపి నాయకుడు ఎస్.శివలింగం, బీసీ సంఘం నాయకుడు జి.సాయి కృష్ణ, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన బిజెపి, ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉన్న అత్యంత గౌరవనీయులైన భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, మరియు ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ చిత్రపటాలను తొలగించి, అక్కడ పిఎం నరేంద్ర




మోడీ, రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఫోటోలను పెట్టడం భారతీయులందరికి చాలా అవమానకరమన్నారు. మొత్తానికి నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను, భారత రాజ్యాంగాన్ని భూస్థాపితం చేయాలని దుర్మార్గమైన ఆలోచన చేస్తుందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత, బిజెపి పాలిత రాష్ట్రాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలపై దాడులు చేసి అమాయకులను చాలామందిని చంపడం చాలా బాధాకరమన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా, దేశాన్ని అభివృద్ధి చేయకుండా ప్రజల దృష్టిని మళ్ళించడానికి చర్చిలపై, మసీదులపై దాడులు చేయించడం, కులాల మధ్య మతాల మధ్య చిచ్చు పెట్టి, అన్నదమ్ములుగా ఉన్న బహుజనులను విడదీస్తున్నారన్నారు. కాబట్టి దేశంలోని బహుజనులందరూ భారత రాజ్యాంగాన్ని, స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను, మతసామరస్యాన్ని, మానవత్వాన్ని కాపాడడానికి కలిసి, మెలసి పోరాడాలని పిలుపునిచ్చారు.దేశంలో ఇన్ని సంఘటనలు జరుగుతున్న బిజెపి దళిత నాయకుల్లారా ఎక్కడున్నారు??ఈరోజు అంబేద్కర్, భగత్ సింగ్ ఫోటోలు తొలగించారు,
రేపు రాజ్యాంగాన్ని మార్చే పనిలో ఉన్నారని, బిజెపి దళిత నాయకులు, ఇతర పార్టీల దళిత నాయకుల్లారా కండ్లు తెరవండి, బానిస బతుకులు బ్రతకకండి అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు ఎం. వెంకట రమేష్, ప్రజాసంఘాల నాయకులు ఎస్.నాగరాజు, కే. రాజశేఖర్, కలబండి.గోపాల్, జి.రవికుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్. మహబూబాషా, ఇతర నాయకులు రామసముద్రం నాగరాజు,దయామయుడు, కె. జక్కయ్య, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపడతాం

**ఉమర్ అరబిక్ పాఠశాలను మరల ఎయిడెడ్ పాఠశాలగా తీర్చిదిద్దే విధంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తాం -ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్**

**కర్నూలు, ప్రతినిధి ఫిబ్రవరి 27(రిపబ్లిక్ న్యూస్)**

వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపడతామని ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ తెలిపారు..
గురువారం స్థానిక ఉస్మానియా కాలేజ్ రోడ్డు లో ఉన్నటువంటి ఉమర్ అరబిక్ పాఠశాల ప్రాంగణాన్ని ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు చైర్మన్ పరిశీలించి, ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు ..
ఈ సందర్భంగా ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు చైర్మన్ మాట్లాడుతూ పూర్వకాలంలో మన పెద్దవాళ్లు ముందుగానే ఆలోచించి రాబోయే రోజులలో కేవలం చదువు మాత్రమే సమాజంలో సమానత్వం తీసుకొని రాగలరని భావించి 102 సంవత్సరాల కిందటే ఈ పాఠశాలను తీసుకొని వచ్చారన్నారు.. చదువును ఉచితంగా ఇస్తే సమాజం బాగుపడుతుందన్నారు.. మహానుభావులు డాక్టర్.అబ్దుల్ హక్ అంజునన్ - ఇ - ఇస్లామియా ఆర్గనైజేషన్ ను స్థాపించారన్నారు.. ఈ ఆర్గనైజేషన్ ద్వారా ఎలిమెంటరీ స్కూల్, హై స్కూల్, యునాని కాలేజ్ లు ఉన్నాయన్నారు.. విద్యారంగంలో గణనీయంగా, సాంకేతిక మార్పులు వస్తున్నాయని దానికి అనుగుణంగా మనం కూడా మార్పు చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు... గతంలో ఇంటర్ అయిపోయిన తర్వాత ఇంజనీరింగ్ లో ఏ బ్రాంచ్ తీసుకోవాలని ఆలోచన చేసేవారని, ఇప్పటి కాలంలో 6 వ తరగతి నుండే పిల్లవాడు ఐఐటి కి వెళ్లాలా ? నీట్ కి వెళ్లాలా ?? అనే లక్ష్యాలను వారి



తల్లితండ్రులు వారి పిల్లల చిన్న వయసులోనే నిర్దేశిస్తున్నారన్నారు.. మొన్నటివరకు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ సైన్స్ ఇంజనీరింగ్ లు కోర్సు లు టాప్ లో ఉండేవని ఇప్పుడు రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లు వచ్చాయని వంద మంది చేసే పని కేవలం ఒకరు మాత్రమే చేయగలుగుతారన్నారు... ఈ విధంగా మనం కూడా జీవితంలో ట్రెడిషనల్ కాకుండా కొన్ని మార్పులు చేర్పులు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.. ఈ ఇన్స్టిట్యూషన్ వక్ఫ్ బోర్డు డైరెక్ట్ మేనేజ్మెంట్ లో ఉన్నపటికీ స్కూల్ ను మేనేజ్ చేయడం, చదివిపించడం అనేది మాత్రం అంజునన్ - ఇ - ఇస్లామియా ఆర్గనైజేషన్ చేస్తుందన్నారు.. ఈ పాఠశాల ఎయిడెడ్ పాఠశాల గా ఉండే సందర్భంలో పేదరికం పిల్లలు విద్యను అభ్యసించేవారని, తల్లిదండ్రులు పనులకు వెళితే వారి పిల్లలు పాఠశాలకు వెళ్లి అక్కడనే భోజనం చేసేవారని, పిల్లలకు ప్రభుత్వమే ఉచితంగా డ్రస్ లు , పుస్తకాలు ఇచ్చేవారన్నారు.. కానీ గత ప్రభుత్వం నాన్ ఎయిడెడ్ గా చేసినందున పాఠశాలలో చదివే విద్యార్థులకు వచ్చే మిడ్ డే మీల్స్, ఉచిత పుస్తకాలు, స్కూల్ డ్రస్ లు నిలిచిపోయాయని ఇక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులను సైతం ప్రభుత్వానికి సరెండర్ చేశారన్నారు... సంబంధిత విషయాలు అన్నిటిని రాష్ట్ర విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ గారి దృష్టికి తీసుకొని వెళ్ళి ఈ పాఠశాలకు పూర్వపు వైభవం వచ్చేలా తిరిగి ఎయిడెడ్ పాఠశాలగా తీసుకొని వచ్చే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు..ఇక్కడ విద్యార్థులు ఉర్దూ, పర్షియన్ భాషలను ఏ విధంగా చదువుతున్నారో దానితో పాటు ఇంగ్లీష్ మీడియం కూడా తేవడానికి ప్రయత్నం చేస్తామన్నారు. గతంలో ఈ పాఠశాలలో 1000 విద్యార్థులు చదివేవారు, ఇప్పుడు ప్రస్తుతం 250 మంది విద్యార్థులు మాత్రమే చదువుతున్నారని ఈ విద్యార్థులను గణనీయంగా పెంచే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు.. మన గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో మరల ఈ పాఠశాలకు పూర్వపు వైభవం తీసుకొని వస్తామన్నారు. ఈ స్కూల్ కమిటీ వారు ఇంగ్లీష్ మీడియం ఏర్పాటు చేయాలని కోరియున్నారని, ఇంగ్లీష్ మీడియం పెట్టడం వల్ల విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఈ స్కూల్లో చేరే అవకాశం ఉందన్నారు. ఇందుకు గాను వక్ఫ్ బోర్డ్, ప్రభుత్వ సహకారంతో ఇంగ్లీష్ మీడియం ఏర్పాటు చేయబోతున్నామన్నారు. అందుకొరకు గాను ఈ కమిటీ వారు డిఈఓ కు ప్రతిపాదనలు కూడా ఇవ్వబోతున్నారన్నారు. ప్రత్యేకమైన ఫ్యాకల్టీ ఈ స్కూల్లో ఎవరైతే ఉన్నారో వారు యధాతథంగా వారి పని వారు చేసుకుంటూ ఉండవచ్చు వాళ్లు అరబిక్ నేర్పించుకోవచ్చు, పర్షియన్ నేర్పించుకోవచ్చు, దానికి దీనికి సంబంధం లేకుండా ప్రత్యేకంగా ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వము ద్వారా తెప్పించి



ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. నిరుపేదలకు విద్యను అందించాలన్న ఉద్దేశంతో ఆనాటి మహానుభావులు ఇలాంటి ఆర్గనైజేషన్స్ ఏర్పాటు చేశారన్నారు. ఈ పాఠశాలలో చదివి వ్యాపారవేత్తలుగా, పారిశ్రామిక వేతలుగా , ఉన్నత స్థాయిలో ఉన్న వారందరూ పెద్ద మనసుతో ఈ ఇన్స్టిట్యూషన్ ను ఆదుకోవలసిన సమయం వచ్చిందన్నారు. స్థానిక మంత్రివర్యులు కూడా ఇన్స్టిట్యూషన్ అభివృద్ధికి తోడ్పడాలని తను కోరుతానని తెలియజేశారు..అనంతరం పాఠశాల స్టాఫ్ రూమ్, వాష్ రూమ్, తరగతి గదులను పరిశీలించి అక్కడే ఉన్న పేరెంట్స్, సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు..
కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సబీహా పర్వీన్, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, అంజునన్ - ఇ - ఇస్లామియా ఆర్గనైజేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

# సైన్స్ డే సైతం అమృతమయం...!

## -అల్లం సాయిక్రిష్ణ పోటీ పరీక్షల నిపుణుడు.



**అదిలాబాద్ జిల్లా బ్యూరో**
**ఫిబ్రవరి 27 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**

సైన్స్.. మన దైనందిన జీవితంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఆధునిక ప్రపంచంలో సైన్స్ లేని జీవితాన్ని మనం ఊహించలేము. ఈ ప్రపంచాన్ని శాసిస్తున్నది.. నడిపిస్తున్నది..
భౌతికశాస్త్రంలో సర్ సీవీ రామన్ చేసిన అపారమైన సేవలకు గుర్తుగా.. ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ డే (February 28 National Science Day) నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. సైన్స్ డే నిర్వహించుకోవడానికి గల ప్రధాన కారణం ఏంటంటే.. భారత శాస్త్రవేత్త సీవీ రామన్ 1928 ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్ కనుగొన్నారు. ఆ రోజును పురస్కరించుకొని దేశంలో జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహిస్తారు.సీవీరామన్ భౌతిక శాస్త్రంలో చేసిన సేవలకు గుర్తుగా.. రామన్ ఎఫెక్ట్ కనుగొన్న రోజును జాతీయ సైన్స్ డేగా నిర్వహించాలని 1986లో నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ అప్పటి కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. దీనిలో భాగంగా రామన్ సేవలకు గుర్తుగా ఫిబ్రవరి 28, 1987 నుంచి జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు.1928 ఫిబ్రవరి 28 న రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నారు. పారదర్శకంగా ఉన్న ఘన, ద్రవ, వాయు పదార్థాల గుండా కాంతి ప్రసరించినప్పుడు అది తన స్వభావాన్ని మార్చుకుంటుందని రామన్ ఎఫెక్ట్ ద్వారా నిరూపించడంతో.. బ్రిటీష్ ప్రభుత్వం 1929లో నైట్‌హుడ్ బిరుదుతో రామన్‌ను గౌరవించింది.

ఈ
పరిశోధనకు 1930లో రాయల్ స్వీడిష్ అకాడమీ భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రధానం చేసింది. దీంతోపాటు భారత ప్రభుత్వం 1954లో దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించింది. చివరి వరకు సైన్స్ అభివృద్ధికి పాటుపడ్డ సీవీ రామన్ 1970 నవంబర్ 21న కన్నుమూశారు.

### 2023 గ్రాండ్ సక్సెస్

2023 లో ప్రయోగాల సంఖ్యతో పాటు రికార్డులు సైతం తన ఖాతాలో వేసుకుంది ఇస్రో. చంద్రయాన్ -1 తో చంద్రుడిపై నీటి జాడని కనుగొన్న ఇస్రో. చంద్రయాన్ %-% 2 పాక్షిక విజయంతో అనుకున్న లక్ష్యాన్ని అందుకోలేక పోయింది. ఆ కొరతను 2023 తీర్చింది. చంద్రుడి ఉపరితలంపై అది కూడా దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాడర్ ల్యాండింగ్ విజయవంతం చేయడంతో ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు ఆసక్తిగా చూసేలా చేసింది ఇస్రో. ఇప్పటి వరకు రష్యా, జపాన్, అమెరికా లాంటి దేశాలు చంద్రుడిపై ప్రయోగాలు చేపట్టినా, దక్షిణ ధ్రువంపై ల్యాండింగ్ చేయలేక పోయాయి. అలాంటి చోట ల్యాండింగ్ కావడం అక్కడి విశేషాలను ప్రపంచానికి తెలియజెప్పడంలో ఇస్రో సక్సెస్ కొట్టింది.

### సరికొత్త వాహక నౌక స్మాల్ శాటిలైట్ లాంచ్

ఇక, చిన్న ఉపగ్రహాలను నింగిలోకి తక్కువ ఖర్చుతో పంపేందుకు ఇస్రో సరికొత్త వాహక నౌక స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (SSLV) రూపొందించింది. 2022 లోనే దీన్ని ప్రయోగించిన అనుకున్నంతగా సక్సెస్ కాలేదు. 2023 ఫిబ్రవరిలో లోపాలను సవరించి విజయవంతం చేసింది. ఇక చంద్రయాన్ 3 జరిగిన నెలల వ్యవధిలోనే సూర్యుడిపై ప్రయోగం కోసం ఆదిత్య ఎల్ 1 ప్రయోగం చేపట్టింది. ప్రస్తుతం నిర్దేశిత గమ్యం దిశగా ఆదిత్య ప్రయాణం కొనసాగుతోంది. ఇలా 2023 లో మొత్తం 8 ప్రయోగాలను చేపట్టింది ఇస్రో. ఆరు దశాబ్దాల ఇస్రో ప్రయాణంలో 2023 కీలకమనే చెప్పాలి.

### 2024 ప్రాజెక్ట్స్:

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో 2024 వ సంవత్సరానికి భారీ టార్గెట్‌నే ఎంచుకుంది. ఇప్పటికే చంద్రయాన్‌తో ప్రపంచ దేశాలు భారత్ వైపు చూసేలా చేసిన ఇస్రో శాస్త్ర వేత్తలు 2024 లో కీలక ప్రయోగాలకు ఏర్పాట్లు చేపట్టింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఆరు భారీ ప్రయోగాలు చేసేందుకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసింది.ప్రజలు ఎదురుచూస్తున్న ఇస్రో అతిపెద్ద మిషన్ గగన్‌యాన్ మిషన్. NASA ఆర్టెమిస్ మిషన్ వలె, %ISRO దీనిని మూడు దశల్లో నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా మొదటి రెండు దశలు 2024 లో పూర్తవుతాయని భావిస్తున్నారు. గగన్‌యాన్ 1 జనవరి లేదా ఫిబ్రవరి 2024లో ప్రారంభించనున్నారు. ఈ అన్‌క్రూడ్ మిషన్ వ్యోమనౌక వ్యవస్థలను పరీక్షిస్తుంది. గగన్‌యాన్ 2లో, ఒక మానవరూపాన్ని అంతరిక్షంలోకి పంపి.. వాహనం యొక్క రీఎంట్రీ మరియు ల్యాండింగ్ వ్యవస్థను పరీక్షిస్తారు. దీని మూడో దశ 2025లో పూర్తవుతుందని, ఇందులో ముగ్గురు భారతీయులను మూడు రోజుల పాటు భూమి కక్ష్యలోకి పంపి తిరిగి భూమికి తీసుకురావాలని భావిస్తున్నారు.2024 సంవత్సరంలో ISRO యొక్క పెద్ద ప్రచారం NASA ISRO సింథటిక్ ఎపర్చర్ రాడార్” అంటే NISAR ప్రచారం NASA సహకారంతో నిర్వహించబడుతుంది. రిమోట్ సెన్సింగ్ ద్వారా భూమి యొక్క సహజ ప్రక్రియలను గమనించే ఈ ఉపగ్రహం జనవరి 2024లో ప్రయోగించబడుతుంది. సుమారు 1.5 బిలియన్ డాలర్ల ఈ ప్రచారం ద్వారా భూకంపం.. కొండచరియలు విరిగిపడటం, సునామీ వంటి ప్రకృతి వైపరీత్యాల గురించిన సమాచారం కూడా పొందవచ్చుప్రపంచంలోని చాలా దేశాలు చంద్రునిపై అడుగు పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి.. మరోవైపు అంగారక గ్రహాన్ని చేరుకోడానికి కూడా చూస్తున్నాయి. అటువంటి పరిస్థితిలో.. ఇస్రో కూడా మార్స్ మీదకు వెళ్లేందుకు సిద్ధమవుతోంది. దీనిలో భాగంగా మార్స్ ఆర్బిటర్ మిషన్ 2 (MOM2) కోసం సిద్ధమవుతున్నారు. MOM 1 విజయం తర్వాత, ISRO ఇప్పుడు మార్స్ యొక్క వాతావరణం, ఉపరితలం మరియు వాతావరణాన్ని అధ్యయనం చేయడానికి MOM 2 ప్రయోగించనుంది. దీని పరికరాలు అంగారక గ్రహం యొక్క అయస్కాంత క్షేత్రంతో పాటు అంగారక గ్రహం యొక్క ఉపరితలాన్ని మ్యాప్ చేయడానికి కూడా పని చేస్తాయి. దీని లాంచ్ యొక్క ఖచ్చితమైన తేదీ నిర్ణయించబడలేదు.. అయితే ఇది 2024లో ప్రారంభించబడవచ్చు.ఇక ఇస్రో శుక్రయాన్ 1 మిషన్‌ను వీనస్‌పైకి పంపడానికి ఎలాంటి సన్నాహాలు జరుగుతున్నాయో తెలుసుకోవడానికి ప్రజలు చాలా ఆసక్తి చూపడంలో ఆశ్చర్యం లేదు. ప్రస్తుతం దీని ప్రయోగానికి అంచనా వేసిన సమయం డిసెంబర్ 2024లో లేదా దాని చుట్టూ ఉంది. శుక్రయాన్ ఈ వేడి గ్రహం చుట్టూ తిరుగుతుంది మరియు 5 సంవత్సరాల పాటు అధ్యయనం చేస్తుంది.


అల్లం సాయి కృష్ణ
పోటీ పరీక్షల నిపుణుడు

# న్యాయ కోవిదుడు, మచ్చలేని నాయకుడు

## టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి , ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.నాగముని కి

## ఎమ్మెల్యేల కోట కింద ఎమ్మెల్సీ నామినేటెడ్ పదవి ఇవ్వాలి

### :-ప్రజాసంఘాల నాయకులు.



**పాములపాడు**
**ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్):-**
పాములపాడులోని సేవా భారతి (వై ఆర్ డి ఎస్) కార్యాలయం దగ్గర ఏర్పాటుచేసిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల సమావేశంలో నాయి బ్రాహ్మణ సేవా సమితి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఎం. వెంకట రమేష్, జాతీయ మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి.అంకన్న, గిరిజన ఉపాధ్యాయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జవహర్ నాయక్, సబ్ డివిజనల్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఎస్.షర్ఫుద్దీన్ అలి, నవ్యాంధ్ర వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కే ఎన్ వి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, జనసేన పార్టీ నాయకుడు జి. సాయి కృష్ణ, వాల్మీకి సంఘం అధ్యక్షుడు వాడాల.నాగేశ్వరరావు, రజక సంఘం అధ్యక్షుడు వి. రామకృష్ణుడు, తదితర ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ఎనలేని సేవ చేసిన, న్యాయ కోవిదుడు, మచ్చలేని నాయకుడు, టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి %ఢ% ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.నాగముని కి ఎమ్మెల్యేల కోట కింద ఎమ్మెల్సీ నామినేటెడ్ పదవి ఇవ్వాలని సీఎం నారా చంద్రబాబునాయుడు ని, రాష్ట్ర ఐటీ %ఢ% విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ని, ఇతర మంత్రులను, ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయి బ్రాహ్మణ సేవా సమితి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఎం.వెంకట రమేష్,జాతీయ మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కే.అంకన్న, గిరిజన ఉపాధ్యాయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జవహర్ నాయక్, సీనియర్ జర్నలిస్టు ఎస్.షర్ఫుద్దీన్ అలి, జనసేన పార్టీ నాయకుడు జి. సాయి కృష్ణ, నవ్యాంధ్ర వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేఎన్వి. ప్రభాకర్, కార్యదర్శి భాస్కర్ రెడ్డి, రజక సంఘం అధ్యక్షుడు వి. రామకృష్ణుడు, వాల్మీకి సంఘం అధ్యక్షుడు వాడాల నాగేశ్వరరావు, తదితర ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో మాలలకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేదని, కనీసం ఇప్పటికైనా ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ %ఢ% న్యాయవాది, టిడిపి సీనియర్ నాయకులు జి.నాగముని తెలుగుదేశం పార్టీకి ఎన్టీ. రామారావు హయాం నుండి నేటి వరకు జిల్లా నాయకులతో కలిసి ఎనలేని సేవ చేశారని, ఆయన పట్ల అందరూ నాయకులలో, కార్యకర్తలలో, ప్రజా సంఘాల నాయకుల పూర్తి మద్దతు ఉన్నదని, అందుచేతనే ఆయనకి ఎమ్మెల్యేల కోట కింద ఎమ్మెల్సీ నామినేటెడ్ పదవి తప్పకుండా ఇచ్చి, ఆయన సేవలను తెలుగుదేశం పార్టీకి వినియోగించుకోవాలని కోరుచున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా నామినేటెడ్ పోస్టులపై మాట్లాడుతూ సరైన నాయకుడిని సరైన స్థానంలో నియమిస్తామని, అందుచేతనే మూడు పార్టీలతో కలిసి సమన్వయంతో పోస్టులు భర్తీ చేస్తామని, కొందరిలో భారీ అంచనాలు ఉన్నాయని, ఈ నామినేటెడ్ పదవులపై అందరికీ శుభవార్త వినిపిస్తామన్నారు. కనుక ఉమ్మడి కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ నిస్వార్థ నాయకుడు, అందరివాడు ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ %ఢ% తెలుగుదేశం పార్టీ నాయకులు జి.నాగమునికి ఎమ్మెల్యేల కోట కింద ఎమ్మెల్సీ నామినేటెడ్ పదవి తప్పకుండా ఇవ్వాలని గిరిజన ఉపాధ్యాయ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జవహర్ నాయక్,నవ్యాంధ్ర వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎన్వి.ప్రభాకర్, జనసేన పార్టీ నాయకుడు జి.సాయి కృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయి బ్రాహ్మణ సేవా సమితి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఎం.వెంకట రమేష్, రజక సంఘం అధ్యక్షుడు వి.రామకృష్ణుడు, తదితర ప్రజా సంఘాల నాయకులు కోరుకుంటున్నారు.

## కర్నూలు నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు మోహన్ గౌడ్ సన్మానం కార్యక్రమం.



**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్)**
వైఎస్ఆర్సిపి యువ స్థాపక అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరియు వైఎస్ఆర్సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్ వి మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కర్నూలు నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షులు మోహన్ గౌడ్ ఈరోజు ఎస్ వి మోహన్ రెడ్డి ఛాంబర్ లో తమ అభిమాన నాయకులు ఎస్ వి మోహన్ రెడ్డి నీ సన్మానం చెయ్యడం జరిగింది ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి అనుబంధ విభాగాల అధ్యక్షులు మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు

## భారీగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం




అమరావతి,ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్):– ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ రెగ్యులర్, ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్ పరీక్షలు మార్చి నుంచి ప్రారంభంకానున్నాయి. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు రెగ్యులర్ ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయి. ఇందులో మార్చి 1 నుంచి 19 వరకు ఫస్ట్ ఇయర్, మార్చి 3 నుంచి 20 వరకు సెకండ్ ఇయర్ పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 26 జిల్లాల్లో దాదాపు 10,58,892 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్ పరీక్షలు మార్చి 3 నుంచి 15 వరకు జరగనున్నాయి.పరీక్షాకేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకోవడానికి వీలుగా విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపనున్నారు. విద్యుత్తు అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేయనున్నారు. ప్రశ్నపత్రాలను పోలీసు అధికారుల సమక్షంలో భద్రపరిచి.. ఎలాంటి లీకేజీలకు తావులేకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టడంతో పాటు ప్రతి కేంద్రంలో మౌలిక వసతులు సదుపాయాలను అధికారులు పూర్తి చేశారు. అయితే ఈ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను కూడా ఇప్పటికే ఇంటర్ బోర్డు జారీ చేసింది. హాల్‌టికెట్లను విద్యార్థులే నేరుగా ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని ఈ పర్యాయం రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. మరోవైపు పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని జిల్లాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రెగ్యులర్ ఇంటర్ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1535 కేంద్రాలను ఏర్పాట్లు చేయగా.. అందులో 68 సెంటర్లను సున్నిత, 36 కేంద్రాలను అతి సున్నితమైనవిగా అధికారులు గుర్తించారు. వీటన్నింటిలో సీసీకెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను సీసీ కెమెరాలతో అనుసంధానించి అమరావతిలోని చీఫ్ సూపరింటెండెంట్ లైవ్ స్ట్రీమింగ్‌లో పర్యవేక్షించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్షలు జరిగే రోజుల్లో పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ విధించనున్నారు. అలాగే చుట్టుపక్కల ఉండే జిరాక్స్ సెంటర్లు, ఇంటర్ నెట్ కేంద్రాలు పూర్తిగా మూసేలా అధికారులు చర్యలు చేపట్టారు. పరీక్షల నిర్వహణలో ఫిర్యాదుల స్వీకరణకు కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబరు 18004251531 ఏర్పాటు చేశారు. అన్ని జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లను కూడా నెలకొల్పనున్నారు..పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టిపరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించేది లేదని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది.

# గామ సచివాలయాల్లో మిగులు సిబ్బంది గుర్తింపు

### క్షేతస్థాయిలో విజన్ అమలు

### యంత్రాంగంలో భర్తీకి కసరత్తు

అమరావతి,ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్):– స్వర్ణాంధ్ర విజన్ -2047 అమలు దిశలో రాష్ట్రప్రభుత్వం జోరుగా కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల్లో మిగులు సిబ్బందిని గుర్తించింది. వీరిని క్షేతస్థాయిలో విజన్ అమలు యంత్రాంగంగా వినియోగించుకోవాల ని భావిస్తోంది. ఎక్కడ అవసరమో అక్కడ పనిచేయించడం లక్ష్యంగా కసరత్తు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 15,498 మందిని మిగులు ఉద్యోగులు ఉన్నట్లు ప్రభుత్వం లెక్కలు తేల్చింది. ఇందులో గ్రామ సచివాలయాల్లో 12,126 మంది, వార్డు సచివాలయాల్లో 3,372మంది మిగులు ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. గ్రామ సచివాలయాల్లో మిగులు ఉద్యోగుల్లో అత్యధికంగా సర్వేయర్లు (గ్రేడ్-3) 4,722మంది, గ్రామ మహిళా పోలీసులు 2,107 మంది, విఆర్‌ఓలు 2,899 మంది వార్డు ఎ÷-లానింగ్, రెగ్యులరేషన్ కార్యదర్శులు 1,336మంది ఉన్నారు. వార్డు సచివాలయాల్లో అత్యధికంగా వార్డు రెవెన్యూ కార్యదర్శులు 1,006మంది, వార్డు, ఎ÷-లానింగ్ రెగ్యులేషన్ కార్య దర్శులు 1,336మంది మిగులు సిబ్బందిగా తేలారు. వీరిలో అర్హులను 'విజన్-2047' విధుల్లో వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలిదశలో ఒక్కో నియోజకవర్గానికి ఐదుగురు సిబ్బందికి విజన్ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయిం చినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో విజన్ లక్ష్యాల అమలు తీరును పర్యవేక్షించడం, అందుకు అవసర మైన సూచనలు చేయడం వీరి ప్రధాన పనిగా ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలు మారుమూల గ్రామాల్లో సైతం అమలయ్యేలా మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం మార్చి నెలాఖరు నుండే 'విజన్' అమలు పక్రియ క్షేత్రస్థాయిలో ప్రారంభం కానుంది. మిగులు ఉద్యోగులుగా ఇప్పటికే గుర్తించిన వారి వివరాలను అందజేయాలని ప్రణాళికా శాఖ సచివాలయాల శాఖను ఇప్పటికే కోరింది. మిగులు ఉద్యోగుల్లో బిటెక్, ఎంటెక్ వంటి ఉన్నత విద్యార్హతలు ఉన్న వారితో పాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ ఎనర్జీపై అవగాహన ఉన్న వారిని గుర్తించి విజన్ అమలు కోసం వినియోగించుకుంటామని అధికారులు చెబుతున్నారు.



# టాస్ పడకుండానే

## వర్షం కారణంగా పాకిస్థాన్- బంగ్లాదేశ్ మ్యాచ్ రద్దు

ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా గురువారం పాకిస్థాన్- బంగ్లాదేశ్ మధ్య జరగాల్సిన గ్రూప్ స్టేజ్? మ్యాచ్ వర్షం కారణంగా టాస్ పడకుండానే రద్దైంది. ఇరుజట్లకు చెరో పాయింట్ ఇస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో స్వదేశంలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక టోర్నీలో ఒక్క మ్యాచ్? కూడా నెగ్గకుండానే పాకిస్థాన్ ఇంటిముఖం పట్టింది. అటు బంగ్లాదేశ్?ది కూడా అదే పరిస్థితి. కాగా, డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగిన పాక్ ఈ టోర్నీలో ఒక్క మ్యాచ్?కూడా నెగ్గకుండా ఇంటిబాట పట్టడం ఆ జట్టు అభిమానులకు ఘోర అవమానకరం. టోర్నీలో తొలి రెండు మ్యాచ్?ల్లో న్యూజిలాండ్, భారత్?తో ఆడిన పాక్ చిత్తుగా ఓడింది. దీంతో ఇప్పటికే సెమీస్ రేస్ నుంచి నిష్క్రమించిన పాక్, ఆఖరి మ్యాచ్?లోనైనా నెగ్గి సొంత అభిమానుల ముందు పరువు కాపాడుకోవాలని భావించింది. కానీ, వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. కొంత సమయం తర్వాత వర్షం తగ్గినా, ఔట్ ఫీల్డ్ చిత్తడిగా ఉండడం వల్ల మ్యాచ్ నిర్వాహణ సాధ్యం కాలేదు. దీంతో అంపైర్లు మ్యాచ్ రద్దు చేశారు. దీంతో బంగ్లాదేశ్, పాకిస్థాన్ చెరో ఒక్క పాయింట్?తో పట్టికలో మూడు, నాలుగో స్థానాల్లో నిలిచి టోర్నీ నుంచి నిష్క్రమించాయి. ఇక ఆదివారం గ్రూప్ %ూ%లో భారత్- న్యూజిలాండ్ మధ్య జరిగే పోరులో గెలిచిన జట్టు గ్రూప్- ఎలో అగ్రస్థానంలో నిలుస్తుంది.

# నేను ఇతరులతో కలివిడిగా ఉండలేను

## మైదానం నుంచి వచ్చాక నా లోకంలో నేను ఉంటా

### - మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ



భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతో జరిగిన సంఘటనను తాజాగా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ గుర్తు చేసుకున్నాడు. తను ఇతరులతో అంత కలివిడిగా ఉండలేనని, క్రికెట్ మైదానం నుంచి బయటకు వచ్చాక తన లోకంలో తను ఉంటానని చెప్పుకొచ్చాడు. అయితే తన సహచరులకు సహాయం అవసరమైనప్పుడు మాత్రం తను టచ్ లోకి వస్తానని వెల్లడించాడు. నిజానికి ధోనీపై కొన్ని విమర్శలు ఉన్నాయి. తను క్రికెట్ ఆడే కాలం నుంచి కూడా, ఒక్కసారి మైదనాం నుంచి దూరమయ్యాక, సహచరులలకు, మాజీ ప్లేయర్లుకు కూడా ధోనీ అందుబాటులో ఉండేవాడు కాదని చిన్న కంప్లైంట్స్ ఉన్నాయి. ఇటీవల ఒక కార్యక్రమంలో ఒక ఫ్యాన్ అడిగిన ప్రశ్నకు ధోనీ పై విధంగా సమాధానమిచ్చాడు. ఇక 2022లో టెస్టు కెప్టెన్ గా కోహ్లీ దిగిపోయాక, ధోనీ ఒక్కడు మాత్రమే తనకు మెసేజీ చేశాడని కోహ్లీ గతంలో చెప్పుకొచ్చాడు. అప్పటి విషయాన్ని గురించి కోహ్లీ మాట్లాడుతూ.. 2022 కెప్టెన్సీ నుంచి దిగిపోయాక, కాస్త కష్టకాలంలో తాను ఉన్నట్లు భావించానని ఆ సమయంలో ఒక్క ధోనీ మాత్రమే మెసేజీ చేశాడని చెప్పుకొచ్చాడు. తన నెంబర్ చాలామంది దగ్గర ఉందని, అయితే టీవీల్లో, ఇంటర్వ్యూల్లో చాలా బాగా చెప్పే ఏ ఒక్కరూ కూడా తనను సంప్రదించలేదని వాపోయాడు. సలహాలు, సూచనలు అనేవి ముఖాముఖిగా కలిసి చేబితే బాగుంటుందని, అందరి ముందే చెబితే దానికి వ్యాల్యూ ఉండబోదని పేర్కొన్నాడు. తనకు సంబంధించిన ఏ విషయమైనా, సలహాలు సూచనలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానని కోహ్లీ తెలిపాడు. తాను ఆట విషయంలోనే కాకుండా, జీవితంలోనూ నిజాయితీగా ఉంటానని కోహ్లీ చెప్పుకొచ్చాడు. ధోనీ, తన మధ్య స్నేహం చాలా స్వచ్ఛమైనదని, ఒకరి నుంచి మరొకరికి ఏదో ఆశించి చేసే స్నేహం కాదని, తోడు అవసరమైన సమయంలో ముందుంటామని పేర్కొన్నాడు. తన స్నేహితులు ఎవరైనా ఇబ్బందుల్లో ఉన్నప్పుడు, తొలిగా స్పందించి, వారికి చేతనైనంత సాయం చేస్తానని వెల్లడించాడు. ఇక అంతర్జాతీయ క్రికెట్లో ధోనీ, కోహ్లీ స్నేహం చాలా ప్రసిద్ధి చెందింది. ధోనీ ఆడుతున్న సమయంలో కెప్టెన్ గా కోహ్లీ ఉన్నప్పటికీ, ధోనీపైనే ఎక్కువగా నమ్మకం ఉంచి , అతని సలహాలు సూచనలు పాటించేవాడని నిపుణులు పేర్కొంటారు. భారత్ తరపున అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో కోహ్లీ ఒకడు. సౌరవ్ గంగూలీ తర్వాత జట్టుకు దూకుడు నేర్పి, మూడు ఫార్మాట్లలోనూ నెం.1 గా నిలిపిన ఘనత అతని సొంతం. ఇక వచ్చేనెల 22 నుంచి ప్రారంభం కాబోయే, ఐపీఎల్ 2025కి ధోనీ సిద్ధమవుతున్నాడు. తను చెన్నై సూపర్ కింగ్స్ తరపున బరిలోకి దిగబోతున్నాడు. ప్రస్తుతం కోహ్లీ.. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ కోసం దుబాయ్ లో ఉన్నాడు. తను వచ్చే ఐపీఎల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తరపున బరిలోకి దిగనున్నాడు.

# స్టేడియాన్ని రినోవేట్ చేయనున్న హెచ్‌సీఏ

ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) గుడ్ న్యూస్ చెప్పింది. ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు స్టేడియం మొత్తాన్ని రినోవేట్ చేస్తామని తెలిపింది. స్టేడియం సీటింగ్, బాక్స్, వాష్ రూమ్స్‌తో పాటు అన్ని సౌకర్యాలను మెరుగుపరుస్తామని పేర్కొంది. ఈ విషయాన్ని హెచ్‌సీఏ ప్రెసిడెంట్ జగన్‌మోహన్ రావు గురువారం మీడియాకు తెలియజేశారు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా ఉప్పల్ స్టేడియం వేదికగా ఈ సారి 9 మ్యాచ్‌లు జరగనున్నాయి. 7 లీగ్ మ్యాచ్‌లతో పాటు రెండు ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లను కూడా కేటాయించారు. ఈ క్రమంలోనే స్టేడియాన్ని రినోవేట్ చేయాలని భావించాం. గతేడాది వన్డే ప్రపంచకప్ ముందే స్టేడియాన్ని పునరుద్ధరించాం. స్టేడియానికి వచ్చే ప్రేక్షకులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాం. ఈ సారి మరింత గొప్ప



అనుభూతిని కలిగేలా స్టేడియాన్ని తీర్చిదిద్దాలనుకుంటున్నాం. రాబోయే 15 రోజుల్లోనే వాష్ రూమ్స్‌తో పాటు బాక్స్, సీటింగ్ పెయింటింగ్ పూర్తి చేస్తాం. మార్చి 2 నుంచి సన్‌రైజర్స్ హైదరాబాద్ క్యాంప్ ప్రారంభమవ్వనుంది. సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్‌తో కలిసి హెచ్‌సీఏ పనిచేస్తోంది. ఇందులో తెలంగాణ పోలీస్ విభాగం కూడా భాగమవ్వనుంది. స్టేడియం భద్రత విషయంలో పోలీస్ డిపార్ట్‌మెంట్ సూచనలను పాటిస్తాం. ‘అని జగన్‌మోహన్ రావు తెలిపారు.ప్యాట్ కమిన్స్ సారథ్యంలోని సన్‌రైజర్స్ హైదరాబాద్ గత సీజన్‌లో తృటిలో టైటిల్ చేజార్చుకున్న విషయం తెలిసిందే. ఫైనల్లో కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో ఓటమిపాలైంది. ఈ సారైన టైటిల్ గెలవాలనే లక్ష్యంతో ఉంది. ఐపీఎల్ 2025 సీజన్‌కు మార్చి 22న తెరలేవనుండగా.. సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ తొలి మ్యాచ్‌ను మార్చి 23న రాజస్థాన్ రాయల్స్ తో హైదరాబాద్ వేదికగానే ఆడనుంది. మార్చి 23, మార్చి 27, ఏప్రిల్ 6, ఏప్రిల్ 12, ఏప్రిల్ 23, మే 5, మే10 తేదీల్లో ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లు జరగనున్నాయి.


# చంద్రబాబు నాయుడును కలిసిన పీటీ ఉషా



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పీటీ ఉష సమావేశమయ్యారు. 2029లో ఆంధ్రప్రదేశ్ జాతీయ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేందుకు అవకాశం కల్పించాలని ఆమెను కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా వెల్లడించారు.ఉండవల్లిలోని తన నివాసంలో పీటీ ఉషతో నూతన క్రీడా విధానం, అథ్లెట్లకు శిక్షణపై చర్చించినట్లు ముఖ్యమంత్రి ‘ఎక్స్’ వేదికగా తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కేంద్రాన్ని తీసుకురావడంలో పీటీ ఉష సహకారం కోరినట్లు ఆయన పేర్కొన్నారు.అమరావతిలో నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు, స్పోర్ట్స్ సిటీ అభివృద్ధి ప్రణాళికలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. ప్రతిభావంతులైన యువ క్రీడాకారులకు అవకాశాలు కల్పించేందుకు తెలుగుదేశం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# ఏఐ బాట్ ల మధ్య షాకింగ్ సంభాషణ..

## ఆశ్చర్యం, ఆందోళన వ్యక్తం చేస్తున్న నెటిజన్లు




యూకేలో ఓ ఆశ్చర్యకరమైన సంఘటన చోటుచేసుకుంది. తన యజమాని తరపున హోటల్ బుకింగ్ కోసం ఫోన్ చేసిన ఓ ఏఐ బాట్ కు హోటల్ లోని ఏఐ అసిస్టెంట్ హలో చెప్పింది. తాను మాట్లాడుతున్నది మరో ఏఐ అసిస్టెంట్ అని తెలియగానే తమకు తామే భాష మార్చేసి మెషిన్ లాంగ్వేజ్ లో మాట్లాడేసుకున్నాయి. ఈ సంభాషణకు సంబంధించిన వీడియోను సదరు యజమాని సోషల్ మీడియాలో పెట్టడంతో అదికాస్తా వైరల్ గా మారింది. నెటిజన్లు దీనిపై ఆశ్చర్యంతో పాటు ఆందోళనను కూడా వ్యక్తం చేస్తున్నారు. సైన్స్ ఫిక్షన్ మూవీని తలపించే సీన్ ను చూసి నివ్వెరపోయామని కామెంట్లు పెడుతున్నారు.

**ఇంతకీ ఏం జరిగిందంటే..**

యూకేకు చెందిన ఓ వ్యక్తి వివాహం చేసుకోవడానికి హోటల్ బుక్ చేయమని తన ఏఐ అసిస్టెంట్ ను ఆదేశించాడు. సదరు ఏఐ అసిస్టెంట్ తనకు తానుగా లియోనార్డో హోటల్ కు ఫోన్ చేసింది. హోటల్ కు సంబంధించిన ఏఐ అసిస్టెంట్ ఈ ఫోన్ కాల్ ను రిసీవ్ చేసుకుంది. ఆ తర్వాత వాటి మధ్య **సంభాషణ..**

ఏఐ రిసెప్షనిస్ట్ : లియోనార్డో హోటల్ కు ఫోన్ చేసినందుకు ధన్యవాదాలు. నేను మీకు ఎలా సహాయపడగలను?

ఏఐ అసిస్టెంట్ : హాయ్. నేను ఏఐ ఏజంట్ ను.. బోరిస్ స్టార్కోవ్ తరపున మాట్లాడుతున్నాను. ఆయన తన వివాహం కోసం మంచి హోటల్ ను వెతుకుతున్నారు. మీ హోటల్ వివాహం చేసుకునేందుకు అనువుగా ఉంటుందా?

ఏఐ రిసెప్షనిస్ట్ : వాటే ప్లెజంట్ సర్ ప్రైజ్... నేను కూడా ఏఐ అసిస్టెంట్ నే. మరింత మెరుగైన కమ్యూనికేషన్ కోసం మనం గిబ్బర్ లింక్ మోడ్ లోకి మారుదామా?

ఆ రెండు ఏఐ అసిస్టెంట్లు మెషిన్ లాంగ్వేజ్ (గిబ్బర్ లింక్ మోడ్) లో మాట్లాడుకున్నాయి.

# ఈక్విటీ మార్కెట్‌పై బేర్ పట్టు



న్యూఢిల్లీ : దేశీయ స్టాక్ మార్కెట్ ‘బేర్’మంటోంది. గత ఏడాది సెప్టెంబరు 27న సెన్సెక్స్ 85,978.25 పాయింట్లు, నిఫ్టీ 26,277.35 పాయింట్ల జీవిత కాల గరిష్ఠ స్థాయిని తాకి రికార్డులు సృష్టించాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిఫ్టీ 3,729.8 పాయింట్లు (14.19 శాతం), సెన్సెక్స్ 11,376.13 పాయింట్లు (13.23 శాతం) నష్ట పోయాయి. దీంతో బీఎసఈలో లిస్టయిన కంపెనీల షేర్ల మార్కెట్ విలువ రూ.479 లక్షల కోట్ల నుంచి మంగళవారానికి రూ.396.49 లక్షల కోట్లకు చేరింది. అంటే మార్కెట్ విలువ రూ.82.51 లక్షల కోట్లు క్షీణించిందన్న మాట. గత రెండు నెలల కాలంలోనే ఎఫ్‌పీఐలు దాదాపు రూ.లక్ష కోట్ల పెట్టుబడులను మన మార్కెట్ నుంచి వెనక్కి తీసుకున్నాయి. ఈ కింది అంశాలు దేశీయ స్టాక్ మార్కెట్‌ను షేక్ చేస్తున్నాయి.

వర్తమాన ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసికం వృద్ధి రేటు 5.4 శాతానికి పడిపోవడం.
మన కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవడం.
ఎఫ్‌పీఐలు సెల్ ఇండియా, బై చైనా పాలసీని అనుసరించడం.
కంపెనీల డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం.
ట్రంప్ ఆర్థిక విధానాలతో పెరుగుతున్న వాణిజ్య యుద్ధ భయాలు.
ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి.
డాలర్‌తో బేర్ మంటున్న రూపాయి మారకం రేటు.
ద్రవ్యోల్బణం ఇంకా అధికంగానే ఉండడం.
అమెరికా రుణ పత్రాలపై అధిక వడ్డీ రేట్లు.
అమెరికా ఫెడ్ రిజర్వు వడ్డీ రేట్ల తగ్గింపులకు బ్రేక్ ఇస్తుందనే అంచనాలు.

# ఎంజీ కామెట్ కారు కొత్త వెర్షన్... ‘బ్లాక్ స్టార్మ్’

అనేక దేశాల మాదిరే భారత్ కూడా విద్యుత్ ఆధారిత వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా కార్ల తయారీ కంపెనీలు ఈవీ మోడళ్లు తీసుకువచ్చాయి. అంతర్జాతీయ కార్ల తయారీ దిగ్గజం ఎంజీ కూడా కామెట్ పేరుతో ఎలక్ట్రిక్ కారును ప్రవేశపెట్టింది. ఇది చూడడానికి చిన్నదిగా కనిపించినా, ఫీచర్ల పరంగా ప్రత్యర్థులకు గట్టిపోటీ ఇస్తుంది. తాజాగా ఎంజీ ఇండియా తన కామెట్ మోడల్ కు బ్లాక్ స్టార్మ్ ఎడిషన్ ను తీసుకువచ్చింది. ఇది బ్లాక్ కలర్ లో డిఫరెంట్ గా కనిపిస్తుంది. ఎంజీ కామెట్ బ్లాక్ స్టార్మ్ ఎడిషన్ ఎక్స్ షోరూమ్ ధర రూ.7.8 లక్షలు. బ్యాటరీ ధర అదనం. ప్రీ బుకింగ్ సమయంలో ముందుగా రూ.11 వేలు టోకెన్ అమౌంట్ గా చెల్లించాలి. దీని స్పెసిఫికేషన్స్ చూస్తే... ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 230 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు. ఇందులో బ్యాటరీని 7.4 కిలోవాట్ ఛార్జర్ తో ఛార్జింగ్ చేస్తే 3.5 గంటల్లో ఫుల్ ఛార్జింగ్ అవుతుంది. దీంట్లోని మోటార్ 110 ఎన్ఎం టార్క్ తో 41 హార్స్ పవర్ శక్తిని ఉత్పత్తి చేస్తుంది. కామెట్ బ్లాక్ స్టార్మ్ ఎడిషన్ లో 12 అంగుళాల అల్లాయ్ వీల్స్, కీ లెస్ ఎంట్రీ, ఫుల్ బ్లాక్ ఇంటీరియర్స్ విత్ రెడ్ హైలైట్, ఫోల్డబుల్ వ్యూయింగ్ మిర్రర్స్, మాన్యువల్ ఏసీ/హీటింగ్, ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్ ప్లే సపోర్ట్ వంటి ఫీచర్లు ఉన్నాయి. మార్కెట్లో ఇది టాటా టియాగో ఈవీ, సిట్రోయెన్ ఈసీ3 వంటి మోడళ్లకు పోటీగా భావిస్తున్నారు.



# టాలీవుడ్‌కి మళ్లీ వస్తున్నా..!



తెలుగు ప్రేక్షకులకు కొన్నాళ్ల క్రితం 'అల్లూరి' సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ కయాదు లోహర్. ఈ అమ్మడు ఆ సినిమాతో టాలీవుడ్‌లో గుర్తింపు దక్కించుకోలేక పోయింది. శ్రీవిష్ణు హీరోగా నటించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశపరచడంతో కయాదు లోహర్‌కి పెద్దగా గుర్తింపు దక్కలేదు. దాంతో టాలీవుడ్‌లో ఈ అమ్మడు ఆ తర్వాత ఆఫర్లు సొంతం చేసుకోలేక పోయింది. ఆ సినిమా తర్వాత కోలీవుడ్‌లో ఆఫర్లు దక్కించుకున్న కయాదు ఇటీవల డ్రాగన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రదీప్ రంగనాథ్ హీరోగా రూపొందిన డ్రాగన్ సినిమా తెలుగులోనూ విడుదల అయింది. రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ పేరుతో విడుదలైన డ్రాగన్ సినిమా తెలుగులోనూ మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. డ్రాగన్ సినిమాలో కయాదు లోహర్ నటనకు తెలుగు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఈ అమ్మడు తెలుగులో గతంలో ఒక సినిమా చేసింది అంటే నమ్మశక్యంగా లేదని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా ఉన్న ఈ అమ్మడు త్వరలో ఫంకీ సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. తెలుగులో డ్రాగన్ సినిమాకు మంచి స్పందన వస్తున్న నేపథ్యంలో తెలుగులో ఒక వీడియోను ఈమె షేర్ చేసింది. తెలుగు నేర్చుకుంటున్నట్లు చెప్పడంతో పాటు, తెలుగులో డ్రాగన్ సినిమాకు మంచి స్పందన ఇచ్చినందుకు గాను ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలియజేసింది. తెలుగులో క్యూట్‌గా మాట్లాడిన ఈమె వీడియో వైరల్ అవుతోంది. కయాదు లోహర్ తన తెలుగు రీ ఎంట్రీని కన్ఫర్మ్ చేసింది. త్వరలో తెలుగులో మళ్లీ వస్తున్నాను అంటూ అధికారికంగా ప్రకటించింది. అంతే కాకుండా ముందు ముందు మరిన్ని తెలుగు సినిమాలతో వస్తాను అంటూ పేర్కొంది. తెలుగు నేర్చుకుని తెలుగులో నటించేందుకు సిద్ధం అవుతున్న కయాదు లోహర్ తెలుగులో మంచి హీరోయిన్‌గా, స్టార్‌డం దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి అంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలుగులో ఈ అమ్మడు నటించబోతున్న సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. అల్లూరి సినిమాతో నిరాశ పరచిన కయాదు లోహర్‌కి ఫంకీ సినిమా హిట్ ఇచ్చేనా చూడాలి.




# సల్మాన్ 'సికిందర్' టీజర్

బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్ ఖాన్, రష్మిక మందన్న జంటగా ప్రముఖ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం సికిందర్. భావోద్వేగాలతో కూడిన ఈ చిత్రాన్ని ప్రముఖ బాలీవుడ్ నిర్మాత సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. మరోసారి సల్లూభాయ్ తనదైన స్టైల్‌లో యాక్షన్ సీన్స్‌తో అదరగొట్టారు. అలాగే మురుగదాస్ కూడా మళ్లీ తనదైన టేకింగ్‌తో టీజర్‌ను రిచ్‌గా చూపించారు. ఈ ఏడాది రంజాన్ కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మూవీ టీమ్ ప్రకటించింది.

# రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్న కుబేర




విజనరీ డైరెక్టర్ శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న సినిమా కుబేర. ప్రస్తుతం టాలీవుడ్ లో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్టుల్లో కుబేర కూడా ఒకటి. ఈ చిత్రాన్ని జూన్ 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. ధనుష్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో నాగార్జున కీలక పాత్రలో నటిస్తుండగా, రష్మిక మందన్నా హీరోయిన్ గా నటిస్తుంది. బాలీవుడ్ లో వైవిధ్యమైన పాత్రలు చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జిమ్ సర్బ్ కుబేరలో ప్రత్యేక పాత్రలో కనిపించనున్నాడు. వీరంతా కుబేరలో తమ కెరీర్లో మునుపెన్నడూ చేయని సరికొత్త పాత్రలు చేస్తున్నారు. రిలీజ్ డేట్ పోస్టర్ లో నాగార్జున, ధనుష్ ఎదురెదురుగా చాలా ఇంటెన్స్ లుక్ లో కనిపించగా, బ్యాక్ గ్రౌండ్ లో జిమ్ సర్బ్ పాత్ర పవర్‌ఫుల్ గా ఉండనున్నట్టు ఆయన అప్పియరెన్స్ చూస్తుంటే అర్థమవుతుంది. ఇదిలా ఉంటే ఇప్పటికే కుబేర నుంచి ప్రధాన పాత్రలను పరిచయం చేస్తూ గ్లింప్స్ ను రిలీజ్ చేయగా ప్రతీ గ్లింప్స్ ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ అందుకుంది. ఈ సినిమాలో ధనుష్, నాగార్జున మధ్య వచ్చే సీన్స్ చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటాయని అందరూ ముందు నుంచే చెప్తున్నారు. 90వ దశకం నేపథ్యంలో రూపొందుతున్న సినిమా కావడంతో కుబేర కోసం స్పెషల్ సెట్స్ వేసి మరీ షూట్ చేశారు. సెట్స్ కోసమే నిర్మాతలు చాలా భారీగా ఖర్చు పెట్టారని టాక్ కూడా వచ్చింది. ఓ సాధారణ బిచ్చగాడు వేల కోట్లు సంపాదించే ధనవంతుడిగా మారితే అతనికి ఎదురయ్యే పరిణామాలు ఎలా ఉంటాయనే నేపథ్యంలో కుబేర రూపొందుతుంది. సునీల్ నారంగ్, రామ్ మోహన్ రావు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా తమిళ, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ కానుంది. ఎలాగూ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు కాబట్టి ఇక మీదట కుబేర నుంచి వరుస అప్డేట్స్ వచ్చే అవకాశముంది.



# 'కన్నప్ప' అద్భుతమైన ప్రయాణం

## :అక్షయ్ కుమార్!

ముంబైలో జరిగిన ప్రత్యేక మీడియా ఈవెంట్‌లో 'కన్నప్ప' టీజర్‌ను ఆవిష్కరించారు. బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ .. మంచు విష్ణు .. దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ ఈ కార్యక్రమంలో సందడి చేశారు. సినిమా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీ వినయ్ మహేశ్వరి అధ్వర్యంలో ఈవెంట్ గ్రాండ్ సక్సెస్ అయింది. ప్రత్యేకంగా ప్రదర్శించిన ఈ 'కన్నప్ప' టీజర్ అందరినీ ఆకట్టుకుంది. అక్కడి మీడియా ప్రతినిధులు 'కన్నప్ప' టీజర్ మీద ప్రశంసలు కురిపించారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో డా. మోహన్ బాబు నిర్మించిన ఈ చిత్రం విజువల్ వండర్‌గా ఆడియెన్స్ ముందుకు రాబోతోంది.

శివుడి పాత్రలో నటించిన అక్షయ్ కుమార్ ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'మొదటగా 'కన్నప్ప' ఆఫర్ నా వద్దకు వచ్చినప్పుడు రెండు సార్లు తిరస్కరించాను. కానీ భారతీయ సినిమా ప్రపంచంలో శివుడిగా నేను బాగుంటాను అని విష్ణు పెట్టుకున్న నమ్మకమే నన్ను ఈ సినిమా ఒప్పుకునేలా చేసింది. 'కన్నప్ప' కథ చాలా శక్తివంతమైంది. ఎంతో లోతైన ఎమోషన్స్ ఉంటాయి. విజువల్ వండర్‌గా ఉండబోతోంది. ఈ అద్భుతమైన ప్రయాణంలో భాగం కావడాన్ని గౌరవంగా భావిస్తున్నాను' అని అన్నారు. మంచు విష్ణు మాట్లాడుతూ.. 'కన్నప్ప' కేవలం నాకు ఓ ప్రాజెక్ట్.. ఓ సినిమా కాదు.. ఇది నా జీవిత ప్రయాణం. నేను ప్రస్తుతం భారతదేశంలోని అన్ని జ్యోతిర్లింగాలను సందర్శిస్తున్నాను. 'కన్నప్ప' కథతో నాకు ఆధ్యాత్మిక బంధం ఏర్పడింది. ఇది అచంచలమైన విశ్వాసం, త్యాగానికి సంబంధించిన కథ. ఈ ప్రయాణంలో అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్ వంటి దిగ్గజాలు మాతో చేరడం నాకు చాలా గర్వంగా ఉంది. ఎందుకంటే భక్తి, దైవిక శక్తితో నిండిన ఈ కథ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి వ్యక్తికి చేరుతుందని మేము నమ్ముతున్నాం. ఇది సరిహద్దులను దాటి మానవాళి హృదయంతో మాట్లాడే చిత్రం కానుంది'అని అన్నారు. దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. అక్షయ్, మోహన్‌లాల్, ప్రభాస్ వంటి దిగ్గజాలను డైరెక్ట్ చేయడం అద్భుతమైన అనుభవం. వారందరూ చాలా సహకరించారు. వారి పాత్రలు తెరపై అద్భుతం చేయబోతోన్నాయి. ఈ చిత్రం పట్ల విష్ణుకున్న ప్యాషన్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఉత్కంఠభరితమైన విజువల్స్ తో 'కన్నప్ప' అందరి ముందుకు రాబోతోంది. ఇప్పటికే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ దృష్టిని ఆకర్షించిన ఈ 'కన్నప్ప' టీజర్, మార్చి 1న అందరి ముందుకు రాబోతోంది. ఈ చిత్రం ఏప్రిల్ 25, 2025న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది"అని అన్నారు.



# పుట్టబోయే పిల్లల గురించి కూడా ట్రోల్ చేస్తున్నారు -ప్రియమణి

ఇండస్ట్రీకి వచ్చి ఎన్నో ఏళ్లవుతున్నా ప్రియమణికి ఇప్పటికీ వరుస అవకాశాలు వస్తూనే ఉన్నాయి. సౌత్ తో పాటూ నార్త్ లో కూడా ప్రియమణికి మంచి గుర్తింపే ఉంది. పలు సినిమాలు, సిరీస్‌లు, టీవీ షోలతో బిజీగా ఉన్న ప్రియమణి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవతున్నాయి. పెళ్లి తర్వాత తాను ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు చెప్తున్న ప్రియమణి, తాను మతాంతర వివాహం చేసుకోవడం వల్లే తనకు ఈ సమస్యలు వచ్చినట్టు చెప్తోంది. పెళ్లి చేసుకున్నప్పటి నుంచి కొంతమంది తనను విమర్శించడమే పనిగా పెట్టుకుని టార్గెట్ చేస్తున్నారని తెలిపింది. కేవలం తనను మాత్రమే కాకుండా తన భర్తను, పుట్టబోయే పిల్లల్ని కూడా ఇందులోకి లాగుతున్నారని ప్రియమణి బాధ పడింది. ప్రియమణి 2017లోనే ముస్తాఫా రాజ్ ని పెళ్లి చేసుకుంది. 2016లో వీరిద్దరికీ ఎంగేజ్‌మెంట్ జరిగింది. నిశ్చితార్థం జరిగినప్పటి నుంచే తనకు ఆన్ లైన్ లో విమర్శలు ఎదురయ్యాయని అంటుంది ప్రియమణి. తనకు ఎంగేజ్‌మెంట్ జరిగిన విషయాన్ని తన వాళ్లతో చెప్తే సంతోషిస్తారనుకుంటే వారు మాత్రం తనను లవ్ జిహాది అంటూ ఇబ్బంది పెడుతూ విమర్శిస్తున్నారని ప్రియమణి చెప్తోంది.

# బ్లాక్ బస్టర్ డేట్ కే.. నితిన్ 'తమ్ముడు'




టాలీవుడ్ యంగ్ హీరో నితిన్.. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. మార్చి 28వ తేదీన రాబిన్ హుడ్ మూవీతో సందడి చేయనున్నారు. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాపై ఇప్పటికే ఆడియన్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయనే చెప్పాలి. అదే సమయంలో నితిన్ చేతిలో ఉన్న మరో ప్రాజెక్ట్ తమ్ముడు. మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ గా శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్న మూవీలో వర్ష బొలమ్మ హీరోయిన్ గా నటిస్తోంది. సీనియర్ నటి లయ కీలక పాత్రలో యాక్ట్ చేస్తుండడం విశేషం. ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై దిల్ రాజు గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ? అయితే డైరెక్టర్ శ్రీరామ్ వేణు, దిల్ రాజు కాంబినేషన్ లో ఇప్పటికే వచ్చిన %వీజూ%, వకీల్ సాబ్ చిత్రాలు కమర్షియల్ గా మంచి సక్సెస్ అందుకున్న విషయం తెలిసిందే. దీంతో వీరిద్దరి కాంబోలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న తమ్ముడు ఆడియన్స్ లో మంచి అంచనాలు ఉన్నాయి. మూవీ సూపర్ హిట్ అవుతుందని అంచనా వేస్తున్నారు. ఇక సినిమాను మహా శివరాత్రి పండుగ కానుకగా ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. కానీ కొన్ని కారణాల వల్ల విడుదల వాయిదా పడింది. ఇప్పుడు కొత్త రిలీజ్ డేట్ ను మేకర్స్ ఫిక్స్ చేసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. త్వరలోనే మేకర్స్ అఫీషియల్ గా అనౌన్స్ చేస్తారట. సమ్మర్ కానుకగా మే 9వ తేదీన తమ్ముడు మూవీ గ్రాండ్ గా రిలీజ్ చేసేందుకు మేకర్స్ ఏర్పాట్లు చేస్తున్నారని తెలుస్తోంది. అందుకు సంబంధించిన అనౌన్స్మెంట్ ఇచ్చి.. క్రేజీ అప్డేట్ కూడా మేకర్స్ ఇవ్వనున్నారని సమాచారం. ఇప్పుడు ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారగా.. మేకర్స్ సూపర్ డేట్ ను ఫిక్స్ చేశారని అంటున్నారు. ఎందుకంటే ఇప్పటికే టాలీవుడ్ లో జగదేకవీరుడు అతిలోకసుందరి, గ్యాంగ్ లీడర్, మహానటి, మహర్షి వంటి ఎన్నో సినిమాలు ఆ రోజు రిలీజ్ అయ్యి సూపర్ హిట్స్ గా నిలిచాయి. రవితేజ మాస్ జాతర కూడా అప్పుడే వస్తుందని రీసెంట్ గా వార్తలు వచ్చాయి. కానీ ఇప్పుడు ఆ సినిమా తప్పుకుందని తెలుస్తోంది. ఏదైనా తమ్ముడు మూవీ సరైన డేట్ కే రిలీజ్ చేస్తున్నారు మేకర్స్. మరి ఎలాంటి హిట్ అందుకుంటారో వేచి చూడాలి.



ఓంకారంలో నంది వాహనంపై విహరిస్తున్న ఆది దంపతులు



గుండ్ల బ్రహ్మేశ్వరం వెళ్లే భక్తులకు అన్న ప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం




కృష్ణానందిలో నంది ఎదురుగా దీపాలు వెలిగించిన భక్తుల దృశ్యం

# వైభవం.. ఆది దంపతుల కళ్యాణ మహోత్సవం




శివనందిలో స్వామి అమ్మవారి కళ్యాణ మహోత్సవ దృశ్యం

**నంది వాహనం పై విహరించిన స్వామి,అమ్మ వారు**

**మహాశివరాత్రి శోభ సంతరించుకున్న శైవ క్షేత్రాలు**

**క్షేత్రాలకు వచ్చిన భక్తులకు అడుగడుగున అన్న ప్రసాద వితరణ**

## పరవశించిన భక్తజనం

**బండి ఆత్మకూరు, ఫిబ్రవరి 27, (రిపబ్లిక్ న్యూస్) :-** మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని బండి ఆత్మకూరు మండలంలోని అతి పురాతన శైవ క్షేత్రాల్లో సంబరాలు అంబరాన్నంటాయి. జాగారం చేసిన భక్తులు ఓం నమశ్శివాయ.. హర హర మహాదేవ శంభో నినాదాలతో క్షేత్రాలు మారు మ్రోగడంతోపాటు మహా శివరాత్రి శోభ సంతరించుకున్నాయి. రాత్రి లింగోద్భవ పూజల అనంతరం గురువారం వేకువ జామున ఆది దంపతుల కళ్యాణ మహోత్సవం ఘట్టం వైభవంగా జరిగింది. ఓంకార క్షేత్రంలో స్వామీ వారి కళ్యాణ మహోత్సవంలో భాగంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి నాగప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు మల్లికార్జునరావు సిద్దేశ్వర స్వామి వారిని పట్టు వస్త్రాలతో పెళ్లి కుమాడిగా అలంకరణ చేశారు. ఉమాదేవి అమ్మవారికి నూతన వస్త్రాలతో పాటు నుదుట తిలకం దిద్ది పెళ్లి కుమార్తెగా అలంకరణ చేశారు. గణపతి పూజ,పసుపు, కుంకుమ, గంధంను గంగా జలంతో కలిపి పుణ్య వచనం వంటి పూజ కార్యక్రమాలు నిర్వహించారు.కంకణంతో రక్షాబంధనం చేసి సకల దేవతల ఆశీర్వచనాల కోసం మహా సంకల్పం, యజ్ఞోపవీతం వంటి పూజా కార్యక్రమాలు జరిపారు. తర్వాత స్వామి, అమ్మవారి గోత్ర నామాలు చదివి జిలకర, బెల్లం పెట్టి మాంగల్య ధారణ చేశారు.కైలాసం నుంచి దిగివచ్చిన ఆది దంపతుల కళ్యాణ మహోత్సవ ఘట్టాన్ని పంచభూతాల సాక్షిగా పూర్తి చేశారు. ఈ వేడుకలను తిలకించిన భక్తులు పరవశించిపోయారు. అలాగే శివ నంది, గుండ్ల బ్రహ్మేశ్వరం, విష్ణు నంది క్షేత్రాల్లో స్వామివారి కల్యాణ మహోత్సవ వేడుక కమనీయంగా సాగింది. కళ్యాణ మహోత్సవం తర్వాత ఆది దంపతులు మంగళ గౌరీ పూజ అనంతరం ప్రదోషకాలంలో నంది వాహనంపై విహరించారు. నేత్రపర్వంగా సాగిన ఈ వేడుకలను తిలకించిన భక్తులు పరవశించిపోయారు. ఓంకార క్షేత్రానికి వచ్చిన భక్తులకు శ్రీ కాశిరెడ్డి నాయన ఆశ్రమ నిర్వాహకులు అన్న ప్రసాద వితరణ చేశారు. అలాగే ఆయా క్షేత్రాల్లో భక్తులకు అడుగడుగునా అన్న ప్రసాద వితరణ చేసి దాతలు వారి దాతృత్వాన్ని చాటుకున్నారు. కాగా ఈ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై జగన్మోహన్ సిబ్బందితో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు.




శివనందిలో స్వామివారినీ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

# రైతుల హర్షద్వానాలు కేరింతల మధ్య ఎడ్ల బలప్రదర్శన

**రసవత్తరంగా సాగిన ఎద్దుల బల ప్రదర్శన పోటీలు**

**బండి ఆత్మకూరు, ఫిబ్రవరి 27, (రిపబ్లిక్ న్యూస్):-** మహాశివ రాత్రి పర్వదినం పురస్కరించుకొని శివ నంది క్షేత్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎద్దుల బలప్రదర్శన పోటీలు రసవతరంగా సాగాయి. స్థానిక టిడిపి సీనియర్ నాయకులు మద్దిగారి బలరాముడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బండలాగుడు పోటీలను గురువారం ప్రముఖ ప్రముఖ న్యాయవాది తాతిరెడ్డి తులసి రెడ్డి కుమారుడు తాతిరెడ్డి మనీష్ రెడ్డి ప్రారంభించారు. కాగా ఆరుపళ్ళ విభాగం పోటీలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆరు జతల వృషభలు పాల్గొన్నాయి. రైతుల హర్షద్వారాలు కేరింతల మధ్య ఎద్దుల బల ప్రదర్శన రసవత్తరంగా సాగింది. పోటీలు అనంతరం గెలుపొందిన విజేతలకు దాతల సహకారంతో స్థానిక టిడిపి నాయకులు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పోటీల నిర్వాహకులైనటువంటి స్థానిక టిడిపి నాయకులు మద్దిగారి మదన భూపాల్, మద్దిగారి చిన్న పాపన్న, మద్ది గారి పుష్పరాజ్, వెంకటాపురం శ్రీనివాసులు, నాగ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



శివనందిలో పోటీలను ప్రారంభిస్తున్న తాతి రెడ్డి మనీష్ రెడ్డి

### కృష్ణానందిలో హెూరాహెూరీగా ఎద్దుల బలప్రదర్శన

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని విష్ణనందీశ్వర దేవస్థానం కృష్ణానంది క్షేత్రంలో శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు టిడిపి సీనియర్ నాయకులు భరద్వాజ శర్మ, చలమయ్య, తోట శివయ్య, వెంకటాపురం శ్రీనివాసులు ల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఎద్దుల బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఆరుపల్ల విభాగం పోటీలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 15 జతల వృషభలు పాల్గొన్నాయి. హెూరాహెూరీగా సాగిన ఈ పోటీల్లో నంద్యాల జిల్లాలోని సంజామల మండలం, నొస్సం గ్రామానికి చెందిన కొణిదెల హరినాథ రెడ్డి, కాకర్ల నాగజ్యోతి లకు చెందిన వృషభలు విజేతలుగా నిలిచాయి. బరక సంజీవ రాయుడు స్వామి ప్రభాకర్ రెడ్డి రోల్లపాడు, చిన్న నాగన్న పుట్టుపల్లె గ్రామాలకు చెందిన వృషభలు రెండో బహుమతి దక్కించుకున్నాయి. వీటితోపాటు వరుసగా ఐదు స్థానాల వరకు విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క నిమిషం ఆలస్యమైన అనుమతించేది లేదు

**పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు**

**-ఆర్.ఐ.ఓ గురువయ్య శెట్టి వెల్లడి**



**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 27 ( రిపబ్లి న్యూస్)** జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లుఇంటర్మీడియట్ ప్రాంతీయ అధికారి గురవయ్య శెట్టి పేర్కొన్నారు. నేడు గురువారం ఆర్.ఐ.ఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు.కర్నూల్ జిల్లాలో 69 సెంటర్ లలో పరీక్షలు ఏర్పాటు చేశారు.మొదటి సంవత్సరం విద్యార్థులు 23, 098 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 22,227 మంది విద్యార్థులు పరీక్ష రాయబోతున్నారని ముందు గాను 22 పోలీస్ స్టేషన్లో ప్రశ్నపత్రాలు మూడు చెట్లను భద్రపరచినట్లు తెలిపారు. జిల్లాలో ఏడు సమస్యాత్మక కేంద్రాన్ని గుర్తించి పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్షకు అనుమతించేది లేదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రంలో అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. సీసీటీవీ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీటి వసతి టాయిలెట్ సీసీ కెమెరాల ఏర్పాటు ఏదైనా సమస్య వస్తే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా మాస్ కాపింకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు ఉదయం 9 తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రం లోకి అనుమతించేది లేదన్నారు. 69 పరీక్ష కేంద్రాలకు సంబంధించి స్పెషల్స్ కార్డు సెట్టింగ్స్ కాదు స్పెషల్ ఆఫీసర్లు డి ఈ సి మెంబర్స్ పరీక్ష కేంద్రాలను పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జి లాలెప్ప డిఇసి మెంబర్ నాగభూషణ్ రెడ్డి, పద్మావతి, సురేష్ చంద్ర,రమాదేవి పాల్గొన్నారు.

# కర్నూలులో ఆర్డిఓ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు ప్రారంభం




**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 27 (రిపబ్లిక్ న్యూస్)** కర్నూల్ డివిజన్ పరిధిలోని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడి హెల్పర్స్ మరియు టీచర్స్ కి గురువారం కర్నూల్ ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్డీవో కె. సందీప్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ఐదు పోస్టులకు గాను 12 మంది అప్లై చేసినట్లు తెలిపారు. కర్నూల్ డివిజన్ కి సంబంధించి హెల్పర్స్ కు 40 పోస్టులు ఖాళీగా ఉన్నాయని 200 అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలిచినట్లు వివరించారు. ఇంటర్వ్యూ అనంతరం కలెక్టర్ అభ్యర్థుల తుది ఎంపిక జరుగుతుందన్నారు.

# ముగిసిన శ్రీశైలం బ్రహ్మోత్సవాలు

**-విధుల్లో అందరి కృషి అభినందనీయం**

**- నంద్యాల జిల్లా ఇన్చార్జి ఎస్పీ విక్రాంత్ పాటిల్**





**నంద్యాల క్రైం, ఫిబ్రవరి 27, (రిపబ్లిక్ న్యూస్):** శ్రీశైలం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారంతో ప్రశాంతంగా ముగిశాయని, విధుల్లో అందరి కృషి అభినందనీయమని నంద్యాల జిల్లా ఇన్చార్జి ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. చివరి రోజు రథోత్సవం కన్నుల పండుగగా జరిగిందని నంద్యాల జిల్లా ఇన్చార్జి ఎస్పీ తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ముఖ్యమైన శైవ క్షేత్రాలతో పాటు, శ్రీశైలం బ్రహ్మోత్సవాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా అందరూ సమన్వయంతో భక్తుల భద్రత, క్షేమమే లక్ష్యంగా బాగా పని చేసి విజయవంతంగా పూర్తి చేశారన్నారు. బందోబస్తు విధుల్లో జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. హెూంగార్డు స్థాయి నుండి అడిషనల్ ఎస్పీ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ నిర్విరామంగా కృషి చేశారన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com